
మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను కలిసిన ఎమ్మెల్యే గంగుల కమలాకర్, మేయర్ సునీల్ రావు, బీఆర్ఎస్ కార్పొరేటర్లు

పుకార్లకు చెక్ పెడుతూ..

- కేసీఆర్, కేటీఆర్‌ను కలిసిన ఎమ్మెల్యే, మేయర్, కార్పొరేటర్లు
- రెండునెలల్లో అన్ని సర్దుకుంటాయన్న కేసీఆర్
- అధినేతతో భేటీతో పార్టీ మారే యోచనకు స్వస్తి

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, కరీంనగర్)

మాజీ మంత్రి, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ కాంగ్రెస్‌లో చేరనున్నారు.. మేయర్ సునీల్‌రావు బీజేపీ తీర్థం పుచ్చుకోనున్నారు. కార్పొరేటర్లు కాంగ్రెస్, బీజేపీ వైపు తొంగిచూస్తూ జంప్ చేసేందుకు ప్రయత్నాలు ప్రారంభించారు.. అంటూ వస్తున్న వార్తలు బీఆర్ఎస్‌లో కలకలం సృష్టించాయి. ఆ పార్టీశ్రేణులు తీవ్ర ఆందోళనకు గురయ్యాయి. కేసీఆర్‌కు ఉద్యమ కాలం నుంచి అధికారం నుంచి దిగిపోయే వరకు అండగా నిలిచిన్న కరీంనగర్ జిల్లాలో ఏమి జరుగుతోంది అంటూ అన్ని రాజకీయపక్షాలు ఇటువైపు దృష్టిసారించాయి. ఆ పార్టీ అధినేత కేసీఆర్ ఒక్క భేటీతో ఈ ప్రచారాలకు చెక్ పెట్టినట్లు తెలిసింది. 'రెండు నెలల్లో మనకు మంచి రోజులు వస్తాయి. రాజకీయంగా గెలుపు ఓటములు సహజం. నిలదొక్కుకొని ముందుకు సాగాలి' అని కేసీఆర్ ఆత్మస్థైర్యం నింపడంతో జిల్లా నేతలు బీఆర్ఎస్‌లోనే కొనసాగాలని నిశ్చయించుకున్నట్లు తెలిసింది.

● పార్టీని వీడబోమంటూనే..

ఇంతకాలం బీఆర్ఎస్ నేతలు పార్టీని వీడి ఇతర పార్టీలోకి చేరబోమని చెబుతూనే అటు బీజేపీ, ఇటు కాంగ్రెస్ నేతలతో రహస్యబేటీలు, చర్చలు చేస్తూ వచ్చారు. కేంద్రమంత్రిగా బాధ్యతలు చేపట్టిన బండి సంజయ్‌కుమార్‌ను మర్యాద పూర్వకంగా కలిసి అభినందించామని చెప్పినా ఆ కలయిక వెనుక రాజకీయ కోణం కూడా లేక పోలేదని అందరూ బాహటంగానే చర్చించుకున్నారు. ఏయే కార్పొరేటర్, ఏ పార్టీలోకి వెళ్తున్నాడు. ఏయే నేత ఏ పార్టీ తీర్థం పుచ్చుకుంటున్నాడు... అంటూ వారిపేర్లను పేర్కొంటూ బాహటంగానే ఆయా పార్టీల్లో చర్చించుకోవడం, మీడియాలో రావడం అందరూ చూశారు. శుక్రవారం మేయర్ సునీల్‌రావు బండి సంజయ్‌కుమార్‌ను కలిసి అభినందించడంతో పాటు స్మార్ట్‌సిటీ రావడానికి చేసిన కృషి ఆయనదేనంటూ ఇంతకాలం చేసిన ప్రకటనలకు భిన్నంగా ప్రశంసించారు. ఆయన బీజేపీలో చేరడానికి రంగం సిద్ధమైందని ప్రచారం జరిగింది. రాజకీయ కలకలాన్ని సృష్టించింది. ఎమ్మెల్యే గంగుల కమలాకర్ త్వరలో కాంగ్రెస్‌లో చేరుతున్నారంటూ డీసీసీ అధ్యక్షుడు, మానకొండూర్ శాసనసభ్యుడు డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ శనివారం అసెంబ్లీ లాబీల్లో మీడియా ప్రతినిధులతో చిట్‌చాట్‌లో పేర్కొనడం బీఆర్ఎస్‌లో కలకలం రేపింది. అది అసత్య ప్రచారమని, బీఆర్ఎస్ వీడేది లేదని గంగుల కమలాకర్ ప్రకటించినా బీఆర్ఎస్‌లో, రాజకీయవర్గాల్లో అనుమానాలు తొలిగిపోలేదు. వీటన్నింటి నేపథ్యంలో కరీంనగర్ రాజకీయాలు వేడెక్కి పోయాయి.

● కేసీఆర్‌తో నాయకుల భేటీ

ఆదివారం బీఆర్ఎస్‌కు 30 మంది కార్పొరేటర్లు ఉండగా వీరిలో అందుబాటులో 28 మంది కార్పొరేటర్లు, మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్, మేయర్ సునీల్‌రావు, డిప్యూటీ మేయర్ చల్ల స్వరూపరాణి ఎర్రవెల్లి ఫాంహౌస్‌లో ఉన్న కేసీఆర్‌తో భేటీ అయ్యారు. ఆ సమయంలో బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు, కేటీఆర్, సిద్దిపేట శాసనసభ్యుడు, మాజీ మంత్రి హరీష్‌రావు అక్కడే ఉన్నారు. అధినేతను కలిసిన కరీంనగర్ నేతలు తాము బీఆర్ఎస్‌ను వీడి బీజేపీలో, కాంగ్రెస్‌లో చేరుతున్నారని వస్తున్న సమాచారాన్ని ప్రస్తావించి వాటిని నమ్మవద్దని తాము పార్టీని వీడబోమని చెప్పినట్లు తెలిసింది. ఈ సందర్భంగా కేసీఆర్ వారికి ధైర్యం చెబుతూ రాజకీయపార్టీలు అన్నాక ఎన్నికల్లో గెలుపు ఓటములు ఉంటాయి.. అవి సహజం.. ఓటమి పొందినంత మాత్రాన కుంగి పోవలసిన అవసరం లేదు.. స్థానిక సంస్థల ఎన్నికల్లో మనకు మంచి ఫలితాలు వస్తాయి.. గ్రామీణ ప్రాంతాల్లో మన బలమేమి తగ్గలేదు.. ఓటు బ్యాంకులో తేడాలేదు... కేవలం ఒకశాతం ఓట్లతో మనం పరాజయం పాలయ్యాం.. మళ్లీ మనకు మంచి రోజులు వస్తాయి.. రెండు నెలల్లోనే మంచి ఫలితాలను చూస్తాం.. అంటూ ఆత్మస్థయిర్యాన్ని నింపారని తెలిసింది. ఇదే సందర్భంలో కేసీఆర్ రాష్ట్రంలో తాజా రాజకీయ పరిస్థితిని కరెంటు కోతలు, సాగుతాగునీటి సమస్యలు, ఇతర అంశాలను ప్రస్తావిస్తూ ప్రజలు మన ప్రభుత్వానికి, ఇప్పటి ప్రభుత్వానికి ఆయా అంశాల విషయంలో ఉన్న తేడాను గమనిస్తున్నారు అని చెప్పినట్లు సమాచారం. కేసీఆర్, కేటీఆర్, హరీష్‌రావులతో భేటీ అనంతరం తాము బీఆర్ఎస్‌లోనే ఉంటామని పార్టీని వీడేది లేదంటూ కరీంనగర్ నేతలు ప్రకటించి జిల్లాకు తిరిగి వచ్చారు. అధినేతతో బేటీ బీఆర్ఎస్ నేతల వలసలకు అడ్డుకట్ట వేస్తుందా లేదా అన్నది ఇప్పుడు జిల్లాలో ఆసక్తికర చర్చగా మారింది.

శ్యాంప్రసాద్ ముఖర్జీ ఆశయ సాధనకు కృషి

● ఘన నివాళులర్పించిన కేంద్ర మంత్రి బండి సంజయ్


శ్యాంప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్‌కుమార్

కరీంనగర్ టౌన్, జూన్ 23: శ్యాంప్రసాద్ ఆశయ సాధనకు కృషి చేస్తామని కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్‌కుమార్ అన్నారు. పాకిస్థాన్, బంగ్లాదేశ్ యుద్ధాల సమయంలో జనసంఘ్ కార్యకర్తలకు తుపాకులిచ్చి సైనికులతోపాటు యుద్ధానికి పంపిన గొప్పవ్యక్తి శ్యాంప్రసాద్‌ముఖర్జీ అన్నారు. ఆదివారం శ్యాంప్రసాద్ ముఖర్జీ వర్ధంతి సందర్భంగా జిల్లా పార్టీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అంతకుముందు చైతన్యపురిలోని శ్రీమహాశక్తి దేవాలయంలో సంజయ్ తన తల్లి శకుంతల సమక్షంలో మొక్క నాటారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కశ్మీర్ వెళ్లడానికి కాంగ్రెస్ సర్కార్ పర్మిట్ కార్డు తప్పనిసరి చేసిందని, తన దేశం వెళ్ళడానికి పర్మిట్ కార్డు ఎందుకని ప్రశ్నిస్తూ ఏక్ దేశ్ మే దో విధాన్, దో ప్రధాన్, దో నిషాన్ నహీ చలేగా అంటూ 370 ఆర్టికల్ రద్దు కోసం ఉద్యమించారన్నారు. కశ్మీరుకు బయలుదేరిన ఆయనను నాటి ప్రభుత్వం అరెస్టు చేసి జైల్లో నిర్బంధించిందని, ఆయన అనుమానాస్పద స్థితిలో జైల్లోనే మరణించారని తెలిపారు. ఆయన మృతిపై కనీసం విచారణ జరపని అమానవీయ ప్రభుత్వం కాంగ్రెస్‌ది అని, ఆయన చనిపోయాక కశ్మీరు వెళ్లడానికి పర్మిట్‌కార్డు తప్పనిసరి అనే విధానాన్ని నెహ్రూ సర్కార్ రద్దు చేసిందన్నారు. ఇది బీజేపీ తొలి విజయమని సంజయ్ తెలిపారు. ఆ మహనీయుడి ఆకాంక్షలకు అనుగుణంగా వాజ్‌పేయ్ ప్రభుత్వం దేశానికి అణ్వాయుధాలను సమకూర్చారని, 370 ఆర్టికల్‌ను రద్దుచేసి ఆయన కలను మోదీ నెరవేర్చారని అన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి, రాష్ట్ర నాయకులు కోమల అంజనేయులు, తాళ్ళపల్లి శ్రీనివాస్‌గౌడ్, గుగ్గిళ్ళ రమేశ్, వంగల శ్రీదేవిపవన్, కన్న కృష్ణ పాల్గొన్నారు.

దొంగలు బాబోయ్..

● రేకుర్తిలో మధ్యప్రదేశ్ దొంగల ముఠా హల్‌చల్ ● తాళం వేసి ఉన్న మూడు ఇళ్లలో చోరీ


దొంగలకు సంబంధించిన సీసీఫుటేజ్ చిత్రాలు

కరీంనగర్ శివారులోని కాళోజీనగర్.. ఆదివారం తెల్లవారు జామున రెండు గంటల ప్రాంతం.. నలుగురు వ్యక్తులు ముసుగులు ధరించి వచ్చారు. పగటి సమయంలో రెక్కీ నిర్వహించారో ఏమో.. తాళం వేసిన ఇళ్లను గుర్తించి వాటిలోకి వెళ్లారు. మూడు ఇళ్లలో చోరీ చేసి దర్జాగా వెళ్లిపోయారు..


చోరీ జరిగిన ఇంటిలో పరిశీలిస్తున్న ఎస్ఐ సాంబమూర్తి

కరీంనగర్ క్రైం, జూన్ 23: కరీంనగర్ శివారులోని రేకుర్తి కాళోజీనగర్‌లో మధ్యప్రదేశ్‌కు చెందిన కరుడుగట్టి దొంగల ముఠా ఆదివారం తెల్లవారుజామున మూడు ఇళ్లలో చోరీకి పాల్పడి సుమారు మూడు క్షల సొత్తును దోచుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.... కాళోజీనగర్‌కు చెందిన జమున ఇంటిలో 1.85 లక్షలు, తిరుపతి ఇంటిలో 1.08 లక్షలు, రాజేందర్ ఇంటిలో 95 వేల రూపాయల విలువైన ఆభరణాలు చోరీ అయ్యాయి. చోరీకి గురైన మూడు ఇళ్లు వంద మీటర్ల పరిధిలో ఉన్నాయి. బాధితులు ఇళ్లకు తాళాలు వేసి ఇతర ప్రాంతాలకు వెళ్లారు. ఆదివారం ఉదయం ఇంటికి వచ్చిన బాధితులు చూసేసరికి తాళాలు పగులగొట్టి ఉండటంతో అనుమానంతో లోపలికి వెళ్లి చూడగా బీరువా, గదిలో వస్తువులు చిందరవందరగా పడి ఉన్నాయి. భద్రపరిచిన బంగారం, వెండి ఆభరణాలతోపాటు నగదు కనిపించలేదు. స్థానికంగా ఉన్న సీసీ కెమెరాల్లో చూడగా నలుగురు దొంగలు ఇనుపరాడ్లు, రాళ్లు పట్టుకుని ఇళ్లలోకి చొరబడి నట్లు తేలింది. దొంగతనాలు జరిగిన ఇళ్లను కరీంనగర్ రూరల్ సీఐ ఏ ప్రదీప్‌కుమార్, కొత్తపల్లి ఎస్ఐ సాంబమూర్తి పరిశీలించారు. క్లూస్‌టీం బృందం ఆధారాలను సేకరించింది. కొద్దిరోజుల క్రితం విజయవాడలో దొంగతనాలకు పాల్పడిన ముఠానే ఈ దొంగతనాలకు పాల్పడినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. దొంగతనాలు జరిగిన ప్రాంతంలో లభించిన సీసీ కెమెరా ఫుటేజీల ఆధారంగా పోలీసులు విచారణ జరుపుతున్నారు. శివారు ప్రాంతాల్లో తాళం వేసి ఇతర ప్రాంతాలకు వెళ్లేవారు స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వాలని, ఇళ్ళలో విలువైన బంగారం, వెండి, నగదు ఉంచకుండా జాగ్రతలు తీసుకోవాలని పోలీసు అధికారులు కోరుతున్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉంటూ ఎవరైనా అనుమానితులు కనపడితే వెంటనే డయల్ 100 లేదా బ్లూకోల్ట్, స్థానిక పోలీసులకు సమాచారం అందించాలన్నారు.

నీట్ లీకేజీకి కేంద్రం బాధ్యత వహించాలి

- ప్రధాని నరేంద్ర మోదీ మౌనం వీడాలి
- కేంద్ర మంత్రి బండి సంజయ్ క్యాంపు ఆఫీస్ ముట్టడికి యత్నించిన విద్యార్థి సంఘాల నాయకులు



కేంద్ర మంత్రి క్యాంపు కార్యాలయం ముట్టడిలో భాగంగా రోడ్డుపై ధర్నా చేస్తున్న ఎన్ఎస్‌యుఐ, వామపక్ష విద్యార్థి సంఘాల నాయకులు, కార్యకర్తలు

కరీంనగర్ అర్బన్, జూన్ 23: నీట్ లీకేజీకి కేంద్ర ప్రభుత్వం బాధ్యత వహించాలని విద్యార్థి, యువజన సంఘాల నాయకులు డిమాండ్‌రు. నీట్ లీకేజీపై కేంద్ర మంత్రులు స్పందించక పోవడాన్ని నిరసిస్తూ విద్యార్థి, యువజన సం ఘాల నేతలు ఆదివారం కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ క్యాంపు ఆఫీస్ ముట్టడికి యత్నించారు. వారిని పోలీసులు అడ్డుకుని అరెస్ట్ చేసి పీటీ సీకి తరలించారు. ఈ సందర్భంగా ఎన్ ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు మునిగంటి అనిల్‌తో పాటు ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్ నాయకులు మాట్లాడుతూ బండి సంజ య్‌కి మతతత్వ రాజకీయాలపై, విద్వేష ప్రసం గాలపై ఉన్న శ్రద్ధ, లక్షల మంది విద్యార్థుల భవిష్య త్తుపై లేకపోవడం సిగ్గుచే టన్నారు. నీట్ లీకేజీ అంశంపై ప్రధాని ఎందుకు స్పం దించడం లేదో బండి సంజయ్ స్పష్టం చెప్పాలన్నారు. పరీక్ష నిర్వహణలో విఫలమైన కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్రప్రధాన్‌ను వెంటనే బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. నీట్‌ను మళ్లీ నిర్వహించాలని, నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్టీఏ)ని రద్దు చేయాలని కోరారు. 15 రోజుల్లో ఈ అంశంపై కేంద్ర ప్రభుత్వం స్పందించకపోతే విద్యార్థి సంఘాల పక్షాన పోరాటాన్ని తీవ్రం చేస్తామని, కేంద్ర మంత్రులను ఎక్కడికక్కడ అడ్డుకుంటామని హెచ్చరించారు. నీట్‌ను రద్దు చేసి మళ్లీ నిర్వహించేవరకు తమ పోరాటం ఆగదన్నారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠరెడ్డి, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శని గరపు రజనీకాంత్, ఎన్ఎస్ యూఐ జిల్లా అధ్యక్షుడు మునిగంటి అనిల్, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సహాయ కార్య దర్శి బాలసాని లెనిన్, పీడీ ఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు రాణాప్రతాప్, డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు నరేష్, ఏఐ వైఎఫ్, పీవైఎల్ఎం నాయ కులు రామారావు, వెంక టేష్ పాల్గొన్నారు.


విద్యార్థి సంఘాల నాయకులను లాక్కెళ్తున్న పోలీసులు

సమస్యల పరిష్కారానికి చొరవ తీసుకోవాలి

● మంత్రి పొన్నం ప్రభాకర్



కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లతో చర్చిస్తున్న రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

కరీంనగర్ అర్బన్, జూన్ 23: కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్‌లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కార్పొరేటర్లు కృషి చేయాలని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. కరీంనగర్ జిల్లా కాంగ్రెస్‌పార్టీ కార్యాలయంలో కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లతో మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదివారం సమావేశమయ్యారు. ఇటీవల మున్సిపల్ కార్పొరేషన్ అధికారులతో కలెక్టరేట్‌లో మంత్రి సమీక్ష నిర్వహించి దృష్టికి వచ్చిన పెండింగ్ పనులు, సమస్యలపై అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. బల్దియాలో పెండింగ్ సమస్యలపై మరోసారి కాంగ్రెస్ పార్టీకి చెందిన కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లు, స్థానిక నాయకులతో సమీక్ష జరిపారు. ఈ సందర్భంగా పలు సమస్యలను కార్పొరేటర్లు మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. కార్పొరేటర్లు చెప్పిన సమస్యలపై మున్సిపల్, ఇతర శాఖల అధికారులతో మంత్రి మాట్లాడి పనులు పెండింగ్ లేకుండా త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మేయర్ ప్రభుత్వానికి చెడ్డ పేరు తెచ్చే విధంగా వ్యవహరిస్తున్నారని, ప్రజల పక్షాన కార్పొరేటర్లు అండగా ఉండి వారి సమస్యల పరిష్కారానికి చొరవ తీసుకోవాలని సూచించారు. ఏ సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకురావాలని, సమస్య పరిష్కారం దిశగా చర్యలు తీసుకుంటానని తెలిపారు. కార్పొరేషన్‌లో సీఎం అస్యూరెన్స్ కింద 133 కోట్ల పెండింగ్ పనులు, అవినీతిపై వచ్చిన ఫిర్యాదులపై పారదర్శకంగా విచారణ జరుగుతుందన్నారు. కార్పొరేటర్లు స్థానికంగా నెలకొన్న సమస్యలపై మంత్రితో చర్చించగా ఆ పనులను వెంటనే పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు ఫోన్‌ద్వారా ఆదేశాలిచ్చినట్లు సమాచారం. కార్యక్రమంలో కార్పొరేటర్లు చాడగొండ బుచ్చిరెడ్డి, నేతికుంట యాదయ్య, భూమాగౌడ్, గంట కళ్యాణి, మాజీ కార్పొరేటర్లు, నాయకులు రవీందర్‌గౌడ్, మల్లికార్జున రాజేందర్, నడిపెల్లి అశోక్‌రావు, పడిశెట్టి భూమయ్య, ఉమాపతి, మాచర్ల ప్రసాద్, కాశెట్టి శ్రీనివాస్, మెండి చంద్రశేఖర్, ఎండీ ఆరిఫ్, ఆకుల ప్రకాశ్, అర్ష మల్లేశం, గంట శ్రీనివాస్, సరిళ్ళ ప్రసాద్, ఆకుల నర్సయ్య, పిట్టల శ్రీనివాస్, వైద్యుల అంజన్‌కుమార్ పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

● ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి

భగత్‌నగర్, జూన్ 23: మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని, సమాజంలో సగభాగం ఉన్న మహిళలకు సమాన హక్కులు కల్పించాలని ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి అన్నారు. ఆదివారం కరీంనగర్ కోతిరాంపూర్‌లోని ముకుందలాల్ మిశ్రా భవన్‌లో ఐద్వా జిల్లా స్థాయి సమావేశాన్ని ద్యావ అన్నపూర్ణ అధ్యక్షతన నిర్వహించారు. సమావేశానికి మల్లు లక్ష్మి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు ఆరు హామీలు ఇచ్చిందని, అందులో మూడు అమలు చేయడం అభినందనీయమన్నారు. మహిళలకు నెలకు 2,500 రూపాయలు ఇవ్వాలని, అర్హులైన మహిళ లందరికీ డబుల్ బెడ్రూమ్ ఇళ్లు ఇవ్వాలని, ఇంటి స్థలం ఉన్న పేద మహిళలకు నిర్మాణానికి ఐదు లక్షల రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో మహిళలపై వేధింపులు, అఘాయిత్యాలు ఎక్కువయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్‌లో ఆరెళ్ల పసిపాపపై అత్యాచారం చేసి హత్య చేయడం దారుణమన్నారు. భూపాలపల్లి జిల్లాలో రక్షణ కల్పించాల్సిన ఎస్సై తన మహిళా కానిస్టేబుల్‌ను లైంగికంగా వేధించడం సిగ్గుమాలిన చర్య అని అన్నారు. కేంద్ర ప్రభుత్వం మహిళలపై చులకనభావంతో ఉందని, మహిళా రెజ్లర్లను బీజేపీ నాయకులు వేధించడం, మణిపూర్‌లో మహిళల్ని నగ్నంగా ఊరేగించినా ప్రధాని నరేంద్రమోదీ పెదవి విప్పకపోవడం విచారకరమన్నారు. ఐద్వా ఆధ్వర్యంలో నిత్యం మహిళలు, గృహిణులు, విద్యార్థులు, వ్యవసాయ కూలీలు ఎదుర్కొంటున్న సమస్యలపై పోరాటం చేస్తోందన్నారు. జూలై 25 నుంచి 28 వరకు రాష్ట్ర స్థాయి శిక్షణ తరగతులను నిర్వహిస్తామని తెలిపారు. శిక్షణ తరగతులు విజయవంతం చేయడానికి అన్ని వర్గాల ప్రజలు, దాతలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి కోనేటి నాగమణి, గుడికందుల సంధ్య, ఎడ్ల రజిత, స్వరూప, పి దేవేంద్ర, మాదాసు యమున, కె రజిత, సీహెచ్ రోజారమణి పాల్గొన్నారు.

యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో
ప్రధాని దిష్టిబొమ్మ దహనం


ప్రధాని దిష్టిబొమ్మ దహనం చేస్తున్న యువజన కాంగ్రెస్ నాయకులు

గణేశ్‌నగర్, జూన్ 23: నీట్‌లో జరిగిన అవకతవకలు, అక్రమాలపై సమగ్ర విచారణ జరపాలని, దోషులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఆదివారం తెలంగాణ చౌక్‌లో యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో ప్రధానం మోదీ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు రాహుల్ మాట్లాడుతూ సక్రమంగా పరీక్ష నిర్వహించలేని ఎన్టీఏను రద్దు చేయాలన్నారు. నీట్ పరీక్ష విషయంలో స్పందించక పోతే కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ ఇళ్లు, క్యాంప్ కార్యాలయాలు ముట్టడిస్తామని హెచ్చరించారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో డీసీసీ అధికార ప్రతినిధి రేగొండ సందీప్, యూత్ కాంగ్రెస్ నాయకులు అనిల్, నవాజ్, కృపాసాగర్, అజీమ్, గట్టు ప్రశాంత్, మాడుగుల ప్రవీణ్, ఆశిష్ గౌడ్, పురుషోత్తం పాల్గొన్నారు.

ఘనంగా మహాలక్ష్మి అమ్మవారి బోనాలు


బోనాలతో వెళ్తున్న మహిళలు

కోరుట్ల రూరల్, జూన్ 23: మండలంలోని చిన్నమెట్‌పల్లిలో మహాలక్ష్మి అమ్మవారి బోనాల పండగ ఆదివారం ఘనంగా జరిగింది. ఉదయం నుంచి భక్తులు అమ్మవారిని దర్శించుకునేందుకు బారులు తీరారు. గ్రామశివారులో ఉన్న అమ్మవారి ఆలయం దాకా డప్పు చప్పుళ్ళతో ఊరేగింపుగా వెళ్లారు. అనంతరం అమ్మవారికి బోనాలు నైవేద్యంగా సమర్పించారు. పోతారాజులు చేసిన విన్యాసాలు ఆద్యంతం ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో గ్రామపెద్దలు, మహిళలు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

మల్లన్న సన్నిధిలో భక్తుల సందడి

- ఒకే రోజు రూ.4 లక్షల ఆదాయం
- వైద్య సౌకర్యం లేక భక్తులకు ఇబ్బందులు


పట్నాలు వేస్తున్న ఒగ్గు పూజారులు

ఓదెల, జూన్ 23: పెద్దపల్లి జిల్లా ఓదెల మండల కేంద్రంలోని భ్రమరాంబ మల్లికార్జునస్వామి సన్నిధిలో ఆదివారం భక్తులు సందడి నెలకొంది. వివిధ జిల్లాల నుంచి దాదాపు పదివేల మందికి పైగా వచ్చిన భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. ఒకేరోజు ఆలయానికి రూ.నాలుగు లక్షల మేరకు ఆదాయం సమకూరిందని అధికారుల అంచనా. భక్తులు స్వామిని దర్శించుకునేందుకు మూడు గంటల సమయం పట్టింది. ఆరుద్ర కార్తెలో వర్షాలు పుంజుకునే అవకాశం ఉన్నందున ఆలయంలో భక్తుల రద్దీ పెరుగుతోంది. ఈ మేరకు ఆలయానికి అధిక సంఖ్యలో తరలివచ్చిన భక్తులు ఒగ్గు పూజారులతో పట్నాలు వేయించారు. అలాగే కోడే మొక్కులు, బోనాలు, సమర్పించారు. అనంతరం మదనపోచమ్మ, బంగారు పోచమ్మ, వీరభద్రస్వామి రామాలయాన్ని భక్తులు దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ప్రతి ఆదివారం, బుధవారం జాతరలో వైద్యం సౌకర్యం ఏర్పాటు చేయాల్సిన సిబ్బంది కనబడకపోవడంతో భక్తులు ఇబ్బందులకు గురయ్యారు. పరకాల మండలానికి చెందిన కొందరు భక్తులు తీవ్రమైన ఉక్కపోతతో అస్వస్థకు గురికాగా చికిత్స కోసం దేవాలయంలోకి వచ్చారు. అక్కడ వైద్య సిబ్బంది లేకపోయేసరికి ఆటోలో పెగడపల్లిలోని ఒక ప్రైవేటు వైద్యుడి వద్ద చికిత్స పొందారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నందున జాతరలో నీరు కలుషితం అయ్యే పరిస్థితి ఉన్నందున వైద్య సేవలు అందేలా చూడాలని భక్తులు కోరుతున్నారు.

గీత కార్మికుడికి తీవ్ర గాయాలు

ఇల్లందకుంట, జూన్ 23: మండలంలోని మల్యాల గ్రామానికి చెందిన బొమ్మ తిరుపతి అనే గీత కార్మికుడు చెట్టు మీద నుంచి కింద పడగా తీవ్ర గాయాల య్యాయి. తోటి కార్మికులు తెలిపిన వివరాల ప్రకారం.. తిరుపతి ఆదివారం వృత్తిలో భాగంగా తాటిచెట్టు ఎక్కి కల్లు తీస్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు జారి కిందపడిపోయాడు. తోటి కార్మికులు వెంటనే జమ్మికుంటలోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం వరంగల్ ఆస్పత్రికి తరలించారు. కాగా తిరుపతి నడుముకు తీవ్ర గాయాలయ్యాయి.తిరుపతికి ఆర్థిక సహాయం అందజేయాలని గీత కార్మిక సంఘం నాయకులు శ్రీనివాస్, దేవేందర్ విజ్ఞప్తి చేశారు.

తాగునీటి సమస్యపై ఆందోళన

గంభీరావుపేట, జూన్ 23: గంభీరావుపేట మండల కేంద్రంలోని డబుల్ బెడ్ రూం ఇళ్లలో తాగునీటి సమస్యపై కాలనీవాసులు ఆదివారం ఆందోళన చేపట్టారు. నాలుగు రోజులుగా మిషన్ భగీరథ నీరు రావడం లేదని, దీంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వాపోయారు. నీటి సమస్యను సంబంధిత అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఇప్పటికైనా స్పందించాలని, సమస్యను వెంటనే పరిష్కరించాలని కోరారు.

పోకిరీల బెడద

- ద్విచక్రవాహనాలపై త్రిబుల్ రైడింగ్
- కళాశాలలు, బస్టాండ్‌లే ప్రధాన అడ్డాలు


వాహనాల సైలెన్సర్లు ధ్వంసం చేస్తున్న పోలీసులు

సిరిసిల్ల క్రైం, జూన్ 23: జిల్లాలో పోకిరీల బెడద మితిమీరిపోయింది. పట్టణంలోని కళాశాలలు, బస్టాండ్‌లే ప్రధాన అడ్డాలుగా చేసుకొని యువకులు ద్విచక్రవాహనాలపై చక్కర్లు కొడుతున్నారు. యువకులు ఒక్కో బైక్‌పై త్రిబుల్ రైడింగ్ చేస్తూ ఇబ్బందులపాలు చేస్తున్నారు. జిల్లాలో స్కూల్స్, కళాశాలలు ప్రారంభమయ్యాయి. దీంతో బస్టాండ్‌లు, ఇళ్లనుంచి కళాశాలలకు వెళ్లే యువతులను ఆటపట్టిస్తున్నారు. యువకుల ఆకతాయి చేష్టలకు కళాశాలకు వెళ్లే విద్యార్థినులు, యువతులు ఆందోళన చెందుతున్నారు. పోకిరీల ఆగడాలపై షీటీమ్ నిఘా వేసినప్పటికీ పోకిరీల ఆగడాలు ఆగడంలేదు. షీటీమ్ బృందాలు కౌన్సెలింగ్ ఇస్తున్నా పరిస్థితిలో మార్పు రావడం లేదు.

● ద్విచక్రవాహనాలపై చక్కర్లు

జిల్లాలోని సిరిసిల్ల, వేములవాడ పట్టణంలో పోకిరీలు ద్విచక్రవాహనాలపై చక్కర్లు కొడుతూ ఆందోళనకు గురి చేస్తున్నారు. యువకుల చేతిలో ద్విచక్రవాహనంపై ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. కళాశాలలకు వెళ్లే విద్యార్థినులు, యువతులను ఇబ్బందుల పాలు చేస్తున్నారు. విద్యార్థినుల ఇళ్ల ముందు చక్కర్లు కొడుతూ హారన్‌లు మోగిస్తూ విసిగిస్తున్నారు. బైక్‌లకు ఎక్కువ శబ్దం వచ్చే హారన్‌లు నిబంధనలకు విరుద్ధంగా బిగిస్తున్నారు. ద్విచక్రవాహనాలు నడిపే యువకులకు ఎలాంటి లైసెన్స్ ఉండదు. మరోవైపు ద్విచక్రవాహనంపై ముగ్గురు రైడింగ్ చేస్తూ ఆందోళన కలిగిస్తున్నారు. కాగా షీటీమ్‌లు పట్టుకొని కౌన్సెలింగ్ ఇచ్చినా పోకిరీల బెడద తప్పడం లేదు. రాజన్న సిరిసిల్ల జిల్లాలోని సిరిసిల్ల, వేములవాడ పట్టణాల్లో ఏడాదిలో వందలాదిమంది యువకులకు షీటీమ్ బృందాలు కౌన్సెలింగ్ ఇచ్చారు. గతంలో సిరిసిల్ల పట్టణంలోని కొందరు యువకులు స్నేహితులుగా ఏర్పడి ఇంట్లో నుంచి డబ్బులు తీసుకెళ్లి ద్విచక్రవాహనాలపై చక్కర్లు కొడుతూ జల్సాలు చేసి కటకటాలపాలైన విషయం తెలిసిందే. మరోవైపు సిరిసిల్ల పట్టణంలోని పాతబస్టాండ్, కళాశాలలు, తదితర రద్దీ ప్రదేశాల్లో బైక్‌పై చక్కర్లు కొడుతూ ఆకతాయి చేష్టలకు పాల్పడిన అనేకమంది యువకులను షీటీమ్స్ అదుపులోకి తీసుకొని కౌన్సెలింగ్ ఇచ్చి వదిలేశారు.

● షీటీమ్‌ల నిఘా..

సిరిసిల్ల, వేములవాడ పట్టణంలో పోకిరీలపై షీటీమ్‌లు నిఘా వేసినా ఆగడాలు తప్పడంలేదు. జిల్లాలో రెండు షీటీమ్‌లు పనిచేస్తున్నాయి. సిరిసిల్ల, వేములవాడలో ఒక్కో షీటీమ్‌లు ఎప్పటికప్పుడు నిఘాను పెంచారు. ప్రధానంగా బస్టాండ్‌లు, కూడళ్లు, కళాశాలల వద్ద నిఘా వేస్తున్నారు. మే నెలలో ముగ్గురు పోకిరీలపై కేసు నమోదు చేసి మరో నలగురిపై పెట్టి కేసులు పెట్టారు. అధిక శబ్దం చేస్తున్న 86 ద్విచక్రవాహనాలను గుర్తించి వాటి సైలెన్సర్‌లను రోడ్ రోలర్ చేత ధ్వంసం చేశారు. మహిళలను, విద్యార్థినులను వేధిస్తున్న వారిని గుర్తించి తల్లిదండ్రుల సమక్షంలో కౌన్సెలింగ్ ఇచ్చి పంపించేశారు. ఎక్కడైనా పోకిరీలు యువతులను ఇబ్బందుల పాలు చేస్తే డయల్ 100కు లేదా 8712656425కు సమాచం అందిస్తే వెంటనే షీటీమ్‌లు రంగంలోకి దిగి రక్షణ కల్పిస్తాయి.

నిఘా తీవ్రం : అఖిల్ మహాజన్, ఎస్పీ



జిల్లాలో పోకిరీల ఆగడాలపై నిఘా తీవ్రం చేశాం.. మహిళలు, యువతులను వేధింపులకు గురించేస్తే కఠిన చర్యలు తప్పవు. మహిళల భద్రతకు అనేక కార్యక్రమాలు చేపడుతున్నాం. అనుమానాస్పద వ్యక్తులు, పోకిరీలు కనిపిస్తే 8712656425, 100కు సమాచారం ఇవ్వాలి. వెంటనే చర్యలు తీసుకుంటాం.

సాయికిరణ్ హత్య కేసులో నిందితుల అరెస్టు

మానకొండూర్, జూన్ 23: మానకొండూర్‌కు చెందిన సాయికిరణ్ హత్య కేసులో నలుగురు నిందితుల మానకొండూర్ పోలీసులు ఆదివారం అరెస్టు చేశారు. సాయి కిరణ్‌కు హత్య చేసిన బట్టి శ్రీనివాస్, బట్టి సునీత, తమ్మిడి గంగారాం, భీమంకర్ శ్యాంరావును అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారు. జడ్జి ఆదేశాలతో నలుగురిని 14 రోజుల రిమాండ్‌కు కరీంనగర్ జిల్లా జైలుకు తరలించారు. మానకొండూర్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.... సాయికిరణ్ కొద్దికాలం కిందట సిద్ధిపేట జిల్లా మిడిదొడ్డి మండలం కొండాపూర్‌లో కోళ్లఫాంలో కూలీగా పనిచేస్తూ భార్యపిల్లతో కలిసిఉండేవాడు. అదేఫాంలో పని చేస్తున్న బట్టి శ్రీనివాస్, బట్టి సునీతలతో సాయి కిరణ్‌కు స్నేహం ఏర్పడింది. సునీతతో అసభ్యకరంగా ప్రవర్తించడంతో వారి మధ్య గొడవ జరగడంతో అక్కడ పనిమానేసిన సాయి కిరణ్ మానకొండూర్‌కు వచ్చి ఒక సామిల్‌లో పనిచేస్తుండేవాడు. ఏప్రిల్ 18న సాయికిరణ్ కొండాపూర్ ఫాంకు వెళ్లి అక్కడ శ్రీనివాస్, సునీతతో మళ్లీ గొడవపడ్డాడు. దీంతో శ్రీనివాస్, అతని భార్య సునీత అక్కడి నుంచి వారి స్వగ్రామం ఆసిఫాబాద్ జిల్లా దహెగాం మండలం బారెగూడెంకు వెళ్లిపోయారు. అయినప్పటికీ సాయికిరణ్ వారికి ఫోన్ చేసి వేధించసాగాడు. దీంతో విసిగిపోయిన బట్టి శ్రీనివాస్, సునీత దంపతులు ఎలాగైనా సాయికిరణ్‌ను అడ్డుతొలగించుకునేందుకు పథకం రచించారు. ఈ మేరకు ఏప్రిల్ 19న సునీతతో సాయికిరణ్‌కు ఫోన్ చేయించి వారి స్వగ్రామానికి పిలిపించుకున్నారు. సాయి కిరణ్ రాగానే అతడిపై కర్రలతో దాడి చేసి హత్య చేశారు. అనంతరం సాయికిరణ్ మృతదేహాన్ని పాడుబడిన వ్యవసాయబావిలో పడేశారు. ఏప్రిల్ 18న ఇంటి నుంచి బయటకు వెళ్లిన సాయికిరణ్ ఇంటికి రాలేదని అతడి భార్య మానకొండూర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసి రెండు నెలలపాటు తీవ్రంగా గాలించి నిందితులను పట్టుకున్నారు.

ఇసుక డంపులు స్వాధీనం



పాషిగామలో ఇసుక డంపులు సీజ్ చేస్తున్న అధికారులు

వెల్గటూర్, జూన్ 23: మండలంలోని స్తంభంపల్లి, పాషిగామలో నిల్వ ఉంచిన అక్రమ ఇసుక డంపులను ఆదివారం అధికారులు దాడులు నిర్వహించి స్వాధీనం చేసుకున్నారు. వేసవిలో ఎండల ప్రతాపానికి గోదావరిలో నీటి మట్టం పడిపోవడంతో ఇసుక తేలింది. గోదావరి ఇసుక కొందరి అక్రమార్కుల కన్ను పడింది. కొందరు ట్రాక్టర్ యజమానులు దొరికిన కాడికి దోచుకుందామని గోదావరిలో ఇసుకను తోడి శివారు ప్రాంతాల్లో నిల్వ చేశారు. మరికొందరు రూ.2 వేల నుంచి రూ.2400ల వరకు ఇతరులకు అమ్ముకున్నారు. కొన్ని రోజులుగా ఈ తంతు కొనసాగుతుండగా కలెక్టర్ ఆదేశాల మేరకు రెవెన్యూ, మైనింగ్, పోలీసు అధికారులు అక్రమ ఇసుక డంపులపై దాడులు నిర్వహించారు. స్తంభంపల్లి శివా రులో ఎల్లమ్మ గుడి ప్రాంతంలో ఏడు చోట్ల నిలువ ఉంచిన 700 ట్రాక్టర్ ట్రిప్పుల ఇసుకను పట్టుకున్నారు. పాషిగామ శివారులో సుమారు 169 ట్రాక్టర్ ట్రిప్పుల అక్రమ ఇసుకను గుర్తించి పంచనామా నిర్వహించి స్వాధీనం చేసుకున్నారు. కార్యక్రమంలో మైనింగ్ ఏడీ జయసింగ్, తహశీల్దార్ శేఖర్, ఎస్సై ఉమా సాగర్, ఆర్ఐ రాజేశ్వరి, రాయల్టీ ఇన్స్‌పెక్టర్ తిరుపతి రావు, డీటీ గంగాధర్, జూనియర్ అసి స్టెంట్ సుదర్శన్, తహశీల్దార్ కార్యాలయ సిబ్బంది, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

మట్టి టిప్పర్లు పట్టివేత



పట్టుకున్న మట్టి టిప్పర్లు

ఎల్లారెడ్డిపేట, జూన్ 23: అనుమతి లేకుండా అక్రమంగా తరలిస్తున్న రెండు మట్టి టిప్పర్లను ఎల్లారెడ్డిపేట తహసీల్దార్ కార్యాలయం ఎదుట పట్టుకున్నట్లు తహసీల్దార్ రామచంద్రం ఆదివారం తెలిపారు. మట్టిని రవాణా చేస్తున్నారనే సమాచారం మే రకు తనిఖీ చేశామని, తరలింపునకు ప్రభుత్వ అను మతి లేదని తేలిందని పేర్కొన్నారు. తమను చూసిన వాహన డ్రైవర్లు పారిపోయారని, వాహనాలను కార్యాలయానికి తరలించి సీజ్ చేశామన్నారు. అను మతి లేకుండా ఇసుక, మట్టిని తరలిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

బైక్ అదుపు తప్పి రైతుకు గాయాలు

ఎల్లారెడ్డిపేట, జూన్ 23: ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని రైతు చర్చ మండలి సమీపంలో ఆదివారం ద్విచక్రవాహనం అదుపు తప్పిన సంఘటనలో స్థానిక రైతు బాధ రాజు తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు 108 వాహనంలో మండల కేంద్రంలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. రాజు తన బైక్‌పై ఎల్లమ్మ ఆలయం వైపునకు వెళ్తుండగా వాహనం అదుపు తప్పింది.

పేకాట స్థావరంపై దాడులు

రుద్రంగి, జూన్ 23: మండల కేంద్రం శివారులోని అటవీ ప్రాంతంలో పేకాట ఆడుతున్నారనే సమాచారం మేరకు ఆ పేకాట స్థావరంపై శనివారం రాత్రి దాడి చేసినట్లు ఎస్సై అశోక్ తెలిపారు. రుద్రంగి, చందుర్తి మండలాల శివారు లోని అటవీ ప్రాంతంలో పేకాట ఆడుతున్నారన్న సమాచారంతో దాడి చేశామని, ఐదుగురిని పట్టుకున్నామని, మరో ఐదుగురు పారిపోయారని పేర్కొన్నారు. రూ.20 వేల నగదు స్వాధీనం చేసుకున్నట్లు, పది మందిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

బైక్‌పై వచ్చి.. చెప్పులు దొంగిలించి..



సీసీ ఫుటేజీకి చిక్కిన అనుమానితుడు

ఓదెల, జూన్ 23: ఆర్థికంగా చితి కి పోయి గానీ, జల్సాలకు అలవాటు పడి గానీ కొందరు దొంగలు చోరీ లకు పాల్పడి డబ్బు, ఆభరణాలు దోచుకెళ్తారు. కానీ ఒక గుర్తుతెలి యని దొంగ స్టైల్‌గా ఖరీదైన బైక్ మీద ఓదెల మల్లికా ర్జునస్వామి ఆలయానికి తరచూ వచ్చి ఒకే వ్యక్తి కి సంబంధించిన మూడు జతల చెప్పులను ఎత్తుకెళ్లా డు. ఇదంతా సీసీ ఫుటేజీకి చిక్కింది. ఆలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న ముద్దసాని కుమారస్వామికి చెందిన మూడు జతల పాద రక్షలను ఇప్పటివరకు ఎత్తుకెళ్లాడు. కేవలం ఒకే వ్యక్తికి చెందిన మూడు జతలు చెప్పులను ఎత్తుకెళ్లడం సీసీ ఫుటేజీలో రికార్డు అయింది. చోరీకి పాల్పడిన వ్యక్తి ఎవరు? పాద రక్షలను ఏం చేస్తున్నాడనేది? తెలియాల్సి ఉంది.

ఘనంగా హ్యాండ్‌బాల్ దినోత్సవం

కరీంనగర్ స్పోర్ట్స్, జూన్ 23: ఉమ్మడి జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రపంచ హ్యాండ్‌బాల్ దినోత్సవం, ప్రపంచ ఒలింపిక్ దినోత్స వాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని లయోల విద్యాసంస్థల మైదానంలో నిర్వహించిన ఈ వేడుకల్లో ఉమ్మడి కరీంనగర్ జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బసర వేని లక్ష్మణ్ ముఖ్య అతిథిగా హాజరై వేడుకలను ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడాకారులు జాతీయ స్థాయిలో రాణించి ప్రభుత్వ ఉద్యోగాలు సాధించాలన్నారు. కార్యక్ర మంలో హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి నమిలికొండ ప్రభాకర్, హ్యాండ్‌బాల్ కోచ్ మూల వెంకటేష్, నాగుల శ్రీనివాస్, జె విజయ్, శ్రీకాంత్, అమర్, శివాజీ, రాజు తదితరులు పాల్గొన్నారు.

సింగరేణి సంస్థను కాపాడుకుందాం

- మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్



మాట్లాడుతున్న మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్

సుభాష్‌నగర్, జూన్ 23: సింగరేణి బొగ్గు గనులను వేలం వేయకుండా సంస్థను కాపాడుకుందామని కార్మికులకు మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ పిలుపునిచ్చారు. సింగరేణిని వేలం వేస్తే చూస్తూ ఊర్కొనేది లేదని ఆయన ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఆదివారం కరీంనగర్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వాలు సింగరేణిని ప్రైవేటీకరణ చేయడానికి అడుగులు వేస్తున్నాయని విమర్శించారు. సింగరేణిని కాపాడాల్సిన బాధ్యత కేంద్ర బొగ్గు గనులశాఖ మంత్రిగా కిషన్‌రెడ్డిపై ఉందన్నారు. గతంలో నష్టాల్లో ఉన్న సంస్థ కార్మికులు, యాజమాన్యం సమష్టి కృషితో నష్టాల నుంచి గట్టెక్కిందన్నారు. లాభాల్లో ఉన్న ఈ సంస్థను ప్రైవేటీకరణ చేయడం ఏమిటని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను ప్రశ్నించారు. ప్రధాని మోదీ, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి దేశంలోని అనేక బొగ్గు గనులతో పాటు సింగరేణి బొగ్గు గనులను కూడా వేలం వేయడానికి నిర్ణయం తీసుకోవడం దురదృష్టకరమని కొప్పుల ఈశ్వర్ అన్నారు. సింగరేణిని బొంద పెట్టడానికే ప్రధాని మోదీ కిషన్‌రెడ్డికి బొగ్గు శాఖ మంత్రి పదవి ఇచ్చినట్లుందని విమర్శించారు. బొగ్గు బావుల వేలంలో సింగరేణికి సంబంధించిన శ్రావణపల్లి కోల్‌బ్లాక్ కూడా ఉందని తెలిపారు. ఇది ఖచ్చితంగా రాష్ట్ర ప్రభుత్వం యొక్క దిగజారుడుతనానికి నిద ర్శనమని, ఇదంతా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసికట్టుగా చేస్తున్న కుట్ర అని ఆరోపించారు. ఎనిమిది మంది బీజేపీ ఎంపీలు గెలిస్తే తెలంగాణ ప్రజలకు ఇచ్చే తొలి రిటర్న్ గిఫ్టు ఇదేనా అని ప్రశ్నించారు. బొగ్గు గనుల వేలాన్ని అభ్యంతరం చెప్పాల్సిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రధాని మోదీతని ఆహ్వానిస్తు న్నారని ఆరోపించారు. ఆనాడు ప్రతిపక్షంలో ఉన్న రేవంత్ రెడ్డి వేలాన్ని వ్యతిరేకిస్తూ మోదీకి లేఖ రాశారని ఈ సందర్భంగా కొప్పుల గుర్తు చేశారు. ఇప్పుడు ముఖ్యమంత్రి హోదాలో రేవంత్‌రెడ్డి ప్రధానికి ఎందుకు లేఖ రాయడం లేదని ప్రశ్నించారు. వేలం కార్యక్రమంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పాల్గొనబోతున్నారని ఆయన ఆరోపించారు. వేలంపై సింగరేణి గుర్తింపు సంఘంగా ఉన్న ఏఐటీయూసీ నోరు విప్పాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లో సింగరేణిని ప్రైవేటు పరం చేయవద్దని, ఆ ఆలోచనను వెంటనే ఉప సంహరించుకోవాలని బీఆర్ఎస్ పక్షాన డిమాండ్ చేశారు. ఈ విలేకరుల సమావేశంలో పెద్దపల్లి జడ్పీ చైర్‌పర్సన్, మాజీ ఎమ్మెల్యే పుట్ట మధుకర్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు ఓరుగంటి రమణారావు, గంగుల అశోక్ తదితరులు పాల్గొన్నారు.

శిథిలమైన కెనాల్ లైనింగ్



దెబ్బతిన్న లైనింగ్

మల్యాల, జూన్ 23: ఎస్సారెస్పీ కెనాల్ లైనింగ్ శిథిలం అయ్యాయి. మల్యాల మండలంలోని లంబాడిపల్లి శివారులో కొంపల్లె చెరువు సమీపంలో లైనింగ్ పూర్తిగా శిథిలమై మట్టి పెళ్లలు లేస్తున్నాయి. లైనింగ్ శిథిలమైన ప్రదేశాల్లో కెనాల్ నీటితో అక్కడ కోతకు గురై ప్రమాదకరంగా మారే అవకాశం ఉంది. ఎస్సారెస్పీ అధికారులు లైనింగ్ పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

అధ్వానం..ఈ రహదారి

మల్యాల, జూన్ 23: మల్యాల బ్లాక్ చౌరస్తా నుంచి వెళ్లే మల్యాల-పెగడపల్లి మార్గం అధ్వానంగా మారింది. ఏళ్ల తరబడిగా రహదారి విస్తరణ పనులు కొనసాగుతుండడంతో గోతులు ఏర్పడి, కంకర లేచి ప్రమాదకరంగా మారగా తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. అయిప్పటికీ పనులు పూర్తి చేయడంపై ప్రజాప్రతినిధులు, అధికారులు చొరవ చూపడం లేదు. దీంతో ప్రయాణికులు తీవ్రంగా మండిపడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.



కంకర తేలి ప్రమాదకరంగా మారిన రహదారి

ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డికి మంత్రి పొన్నం లీగల్ నోటీసులు

కరీంనగర్ అర్బన్, జూన్ 23: ఫ్లై యాష్ తరలింపు విషయంలో మంత్రి పొన్నం ప్రభాకర్‌పై నిరాధార ఆరోపణలు చేశాడంటూ బీఆర్ఎస్ హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డికి మంత్రి తరఫున అడ్వకేట్ పూర్ణచందర్‌రావు లీగల్ నోటీసులు జారీ చేశారు. ఎమ్మెల్యేతో పాటు టీ న్యూస్ మేనేజింగ్ డైరెక్టర్ జోగినిపల్లి సంతోష్‌కుమార్, నమస్తే తెలంగాణ దినపత్రిక చీఫ్ ఎడిటర్ తిగుళ్ల కృష్ణమూర్తి, తెలంగాణ పబ్లికేషన్ ప్రైవేట్ లిమిటెడ్‌కు లీగల్ నోటీసులు జారీ అయ్యాయి. ఫ్లై యాష్ అనేది ఎన్టీపీసీ నుంచి ఉత్పత్తి అవుతుందని, దాన్ని వినియోగించుకునేందుకు వీలుండదని నోటీసుల్లో తెలిపారు. ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి హుజూరాబాద్‌లో ఫ్లై యాష్ లారీలను నిలిపివేసి ఓవర్‌లోడ్‌తో వెళుతున్నాయని, ప్రతి లారీకి డబ్బులు తీసుకుంటూ పంపిస్తున్నారని మంత్రి పొన్నం ప్రభాకర్ పరువుకు భంగం కలిగేలా నిరాధార ఆరోపణలు చేశారని నోటీసుల్లో పేర్కొన్నారు. వ్యక్తిగత కక్షతో రాజకీయంగా ఎదుర్కోలేక మంత్రి పొన్నం ప్రభాకర్‌పై చేసిన ఆరోపణలకుగాను ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డికి లీగల్ నోటీసులు జారీ చేశారు. ఈ వార్తను ప్రసారం చేసిన టీ న్యూస్‌తో పాటు నమస్తే తెలంగాణ దినపత్రికకు కూడా అడ్వకేట్ పూర్ణచందర్‌రావు లీగల్ నోటీసులు జారీ చేశారు.

బాలికపై వృద్ధుడి అత్యాచారం

- నిందితుడిని చితకబాది పోలీసులకు అప్పగించిన స్థానికులు

- పోక్సో కింద కేసు నమోదు

రాయికల్, జూన్ 23: జగిత్యాల జిల్లా రాయికల్ పట్టణంలో సింగు గంగనర్సయ్య (60) అనే వృద్ధుడు ఓ బాలికను మాయ మాటలు చెప్పి తన టైలర్ షాపునకు పిలిపించుకుని ఆదివారం అత్యాచారానికి ఒడిగట్టాడు. స్థానికులు నిందితుడిని చితకబాది పోలీసులకు అప్పగించారు. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం.. రాయికల్‌కు చెందిన సింగు గంగనర్సయ్య అనే వృద్ధుడు టైలర్ షాపు పెట్టుకుని జీవిస్తున్నాడు. తరచూ టైలర్ షాపునకు వచ్చే ఓ బాలికను ఆదివారం తన షాపునకు పిలుచుకుని మాయమాటలు చెప్పి అత్యాచారానికి ఒడిగట్టాడు. బాలిక షాపునకు వెళ్లిన తర్వాత షట్టర్ తలుపు మూసివేయడంతో గమనించిన స్థానికులు బాలిక కుటుంబీకులకు సమాచారం ఇచ్చారు. అనంతరం కుటుంబీకులతో కలిసి స్థానికులు షట్టర్‌ను తీయాలని బెదిరించడంతో ఈ ఘటన వెలుగుచూసింది. స్థానికులు వృద్ధుడిని చితకబాది అనంతరం పోలీసులకు అప్పగించారు. బాలిక తల్లి ఫిర్యాదు మేరకు వృద్ధుడిపై పోక్సో కింద కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నట్లు ఏఎస్సై దేవేందర్ తెలిపారు.

బీజేపీ నాయకులు ఆత్మపరిశీలన చేసుకోవాలి

- సన్న రకం సాగుచేసే రైతులకు రూ. 500 బోనస్ - ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి



రేచపల్లిలో కాలువను పరిశీలిస్తున్న ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

సారంగాపూర్, జూన్ 23: తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు బీజేపీ పాలిత రాష్ట్రాలు, దేశంలో ఎక్కడ అమలు జరగడం లేదని ప్రభుత్వాన్ని విమర్శించే ముందు బీజేపీ నాయకులు ఆత్మ పరిశీలన చేసుకోవాలని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని రేచపల్లి గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామంలో ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనులను పరిశీలించారు. అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గత ప్రభుత్వంలో కేసీఆర్ సన్నరకం సాగు చేయమని ఆంక్షలు విధించి ఏ రకమైన బోనస్ ఇవ్వకుండా రైతులను మోసం చేశారని గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏ విధమైన ఆంక్షలు లేకుండా సన్న రకం సాగు చేసే రైతులకు క్వింటాల్‌కు 500 రూపాయలు బోనస్ ఇచ్చి రైతులను ఆదుకుంటామని తెలిపారు. నిరుపేదలకు నాణ్యమైన సన్న బియ్యం పంపిణీ చేసేందుకు ప్రభుత్వం సన్న రకం సాగును రూ. 500 బోనస్ కల్పించి ప్రోత్సహిస్తుందన్నారు. రైతులపై ఆర్థిక భారం పడకుండా పంటల బీమా పథకానికి 50 శాతం రాష్ట్ర ప్రభుత్వమే భరిస్తూ ప్రీమియం చెల్లిస్తుందని అన్నారు. గత ప్రభుత్వం పూర్తి స్థాయిలో రుణ మాఫీ చేయలేదని ఇంకా నాలుగువేల కోట్లు బకాయిలు చెల్లింపు చేయలేదన్నారు. కేసీఆర్ ప్రభుత్వం రెండు పర్యాయాలు కలిపి రూ 28వేల కోట్లు అయితే కాంగ్రెస్ ప్రభుత్వం రెండు లక్షలు ఏక మొత్తంలో రూ 31వేల కోట్లతో రుణమాఫీ చేస్తోందన్నారు. మిషన్ భగీరథ పథకం ద్వారా రాష్ట్రంలో 100 శాతం తాగు నీరందించామని కేంద్ర ప్రభుత్వానికి తప్పుడు నివేదిక సమర్పించడంతో రాష్ట్రానికి రావల్సిన నిధులు పొందలేక పోతున్నామన్నారు. దీంతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రాష్ట్రంలో భగీరథ నీరు ఏ మేరకు అందుతుందో పూర్తిస్థాయిలో సర్వే చేయిస్తున్నారని తెలిపారు. భవిష్యత్తులో రేచపల్లిలో నీటి కొరత ఉత్పన్నం కాకుండా గ్రామంలో మంచి నీటి బావికి ప్రభుత్వం ద్వారా మంజూరైన నిధులతో గాజుల నిర్మాణం చేపట్టామని తెలిపారు. కార్యక్రమంలో ప్రసాద్ గౌడ్, తిరుపతిరెడ్డి, ఆకుల రాజిరెడ్డి, ఇబ్రాహీం, లక్ష్మారెడ్డి, హరీష్, ఆకుల రాజిరెడ్డి, రాజన్న, తదితరులు పాల్గొన్నారు.

కాళేశ్వరం ప్రాజెక్టుపై కాంగ్రెస్ ప్రభుత్వానికి అవగాహన శూన్యం



చర్చావేదికలో మాట్లాడుతున్న వి ప్రకాశ్

కరీంనగర్ టౌన్, జూన్ 23: కాళేశ్వరం ప్రాజెక్టుపై కాంగ్రెస్ ప్రభుత్వానికి, సీఎం రేవంత్‌రెడ్డికి అవగాహన లేదనే విషయం స్పష్టమైందని ప్రముఖ జలవనరుల నిపుణులు వి.ప్రకాశ్ అన్నారు. ఆదివారం నగరంలోని ఫిలింభవన్‌లో డాక్టర్ బీఎస్‌రావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కాళేశ్వరాన్ని కాపాడుకుందాం అనే అంశంపై నిర్వహించిన చర్చా వేదికకు ఆయన ప్రధాన వక్తగా హాజరయ్యారు. కాళేశ్వరం ప్రాజెక్టు ప్రాముఖ్యతపై వివరంగా చర్చించారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ ఎక్కడైనా బ్యారేజీలు ఇసుకలో నిర్మిస్తారా అని సీఎం రేవంత్‌రెడ్డి పదేపదే అన్నారని, బ్యారేజీలు ఇసుకలోనే నిర్మిస్తారనే విషయంపై ఆయనకు అవగాహన లేక పోవడం హాస్యాస్పదమని అన్నారు. మేడిగడ్డ బ్యారేజీకి 86 పియర్స్ ఉంటే మూడు పీయర్స్ దెబ్బతిన్నాయని అయినంత మాత్రాన ప్రాజెక్టును మూలన పడేస్తారా అని ప్రశ్నించారు. బీఆర్ఎస్‌ను ఓడించాలనే ఉద్దేశంతోనే కాంగ్రెస్, బీజేపీలు కాళేశ్వరంపై విషప్రచారం చేశాయని అన్నారు. డ్యాం సేఫ్టీ అథారిటీ కూడా ఈ పార్టీలకే వంత పాడిందని అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై రేవంత్‌రెడ్డి పచ్చి అబద్దాలు ప్రచారం చేశారని, తెలంగాణ ప్రజలు దానిని నమ్మారని అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు ముందు, తర్వాత పరిస్థితులను గమనిస్తే కేసీఆర్ ప్రభుత్వం సాగునీటికి ఎంత ప్రాధాన్యత ఇచ్చిందో అర్థమవుతుందని అన్నారు. తుమ్మిడిహెట్టి వద్ద ప్రాజెక్టు కట్టవద్దని కేసీఆర్ అనలేదని, అందుకు సెంట్రల్ వాటర్ కమిషన్, అప్పటి మహారాష్ట్ర ప్రభుత్వం ఒప్పుకోలేదని స్పష్టం చేశారు. తాను ఏపార్టీలో లేనని, రాజకీయాలతో సంబంధం లేకుండా కాళేశ్వరం ప్రాజెక్టుపై తెలంగాణ ప్రజలు ఉద్యమించాలని, మేధావి వర్గం అందుకు కృషిచేయాలని కోరారు. తెలంగాణకు గుండె కాళేశ్వరం ప్రాజెక్టు అని, కేవలం మూడు పీయర్లు కుంగిపోతే ప్రాజెక్టును మూలన పడేస్తారా, పనులు చేసేందుకు ఎల్‌అండ్‌టీ కంపెనీ ముందుకు వచ్చినా రాష్ట్ర ప్రభుత్వం ఎందుకు స్పందించడం లేదని బీఎస్‌రావు ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ బీఎస్‌రావు ప్రశ్నించారు. ప్రజల సొత్తు అయిన కాళేశ్వరం ప్రాజెక్టును కాపాడుకోవలసిన బాధ్యత తెలంగాణ ప్రతి పౌరుడిపై ఉందని అన్నారు. కార్యక్రమంలో జగిత్యాలకు చెందిన రాజం తదితరులు పాల్గొన్నారు.

ముందుచూపేదీ?

- యేటా వర్షాకాలంలో నీట మునుగుతున్న కాలనీలు - పట్టించుకోని అధికారులు



రాయికల్‌లో నీట మునిగిన కేశవనగర్ (ఫైల్)



కాలనీలో నీట మునిగిన ఇళ్లను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్ (ఫైల్)

రాయికల్, జూన్ 23: అధికారులు ముందస్తు చర్యలు తీసుకోకపోవడంతో యేటా వర్షాకాలంలో రాయికల్ పట్టణంలోని పెద్ద చెరువు వరదతో ముంపు ఏర్పడుతుంది. పట్టణ శివారు కాలనీలు నీట మునుగుతుండటంతో కాలనీవాసులు ఆందోళన చెందుతున్నారు. పెద్ద చెరువు 200 ఎకరాల విస్తీర్ణంలో ఉండగా, రాయికల్, మైతాపూర్, చెర్లకొండాపూర్ గ్రామాలకు సాగునీరు అందడంతో పాటు భూగర్భజలాల పెంపునకు ఎంతో దోహదపడుతుంది. వర్షాకాలంలో చెరువు నిండి వరదనీరు ఉప్పొంగి ప్రవహించినప్పుడు పట్టణంలోని 5, 6, 7 వార్డుల్లోని ఇళ్లలోకి నీరు చేరుతుంది. భీమన్నవాడ, మత్తడి వాడ, గొల్లవాడ, కేశవనగర్ కాలనీవాసులు వర్షాకాలం వచ్చిందంటే ఆందోళన చెందుతున్నారు. అంతేగాకుండా పెద్ద చెరువు నిండినప్పుడు చెర్లకొండాపూర్, రాయికల్, మైతాపూర్‌లోని చెరువు కట్ట తీర ప్రాంతాల్లోని వ్యవసాయ పొలాలు నీట మునగడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా రు. లోలెవల్ వంతెనతో వర్షాకాలంలో ప్రజలకు ముప్పు పొంచి ఉంది. చిన్న వర్షాలకు సైతం లోలెవల్ వంతె నలపై నుంచి వరద నీరు ప్రవహించడంతో రాకపోకలు నిలిచిపోతు న్నాయి. మండలంలోని ఇటిక్యాల, మూటపెల్లి, వస్తాపూర్, ధర్మాజీపేట, రామాజీపేట గ్రామాల్లో లోలెవల్ వంతెనలు ఉన్నాయి. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి నివారణ చర్యలు చేపట్టి ముంపునకు గురి కాకుండా చూడాలని కోరుతున్నారు.

ఇళ్లల్లోకి వరద నీరు వస్తోంది..



రాయికల్ పట్టణంలో గత ఏడాది కురిసిన భారీ వర్షాలకు కేశవనగర్, గొల్లవాడ, మత్తడివాడ, భీమన్నవాడలోకి నీరు చేరడంతో చాలా ఇబ్బందులు ఎదుర్కొన్నాం. ఇప్పటికైనా అధికారులు స్పందించి వర్షాకాలంలో ముందస్తు చర్యలు తీసుకొని నీరు చేరకుండా చూడాలి

- నీలి తిరుపతి, సింగిల్ విండో డైరెక్టర్

ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదు..



మా వార్డులో వర్షం పడితే చాలు ఇళ్లలోకి నీరు వస్తున్నాయి. ఎన్నిసార్లు అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదు. ఈసారైనా వరదలు రాక ముందే చర్యలు చేపడితే కాలనీవాసులకు ఇబ్బందులు ఉండవు. ప్రభుత్వం, అధికారులు స్పందించి ముంపు పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలి. వర్షాలు కురిస్తే ఇబ్బందులు రాకుండా చూడాలి.

- అన్వరీ బేగం, 6వ వార్డు కౌన్సిలర్, రాయికల్

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి

-కేంద్రమంత్రి బండి సంజయ్‌కుమార్

కరీంనగర్ టౌన్, జూన్ 23: ప్రతి ఒక్కరూ మొక్కలను విరివిగా నాటాలని కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్‌కుమార్ పిలుపునిచ్చారు. చెట్లతోనే పర్యావరణ పరిరక్షణ జరుగుతుందని అన్నారు. జల సంరక్షణ- వన సంరక్షణపై ప్రచురించిన వాల్ పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ నీరు కలుషితం కాకుండా చూసుకోవాలన్నారు. వృథాగా ఏరులై పారే వర్షపు నీటిని ఒడిసి పట్టి ఇంకుడు గుంతలకు మళ్లించాలని అన్నారు. తద్వారా భూగర్భ జలాలు పెరిగి నీటికష్టాలు తీరుతాయని అన్నారు. ప్రకృతి వనరులైన అడవులను, జలవనరులను, కాపాడుకుంటే అవి సమస్త మానవాళిని కాపాడుతాయని అన్నారు. ఈకార్యక్రమంలో పర్యావరణ వేత్త తోట లక్ష్మన్‌రావు, పెద్ది లక్ష్మినారాయణ, సామ నారాయణ, పెద్ది రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులైన జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు

-మంత్రి పొన్నం ప్రభాకర్



మంత్రి పొన్నం ప్రభాకర్‌కు వినతిపత్రం అందజేస్తున్న జర్నలిస్టులు

సుభాష్‌నగర్, జూన్ 23: అర్హులైన జర్నలిస్టులకు ఇళ్ళ స్థలాలు అందించేందుకు కృషి చేస్తామని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ఆదివారం నగరంలోని మాచెర్ల గార్డెన్‌లో జర్నలిస్టులు మంత్రిని కలిసి వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల చింతకుంట, మల్కాపూర్‌లో జర్నలిస్టులకు ఇచ్చిన ఇళ్ళ స్థలాలకు సంబంధించి, ఇరిగేషన్ శాఖ నుంచి ఎన్‌వోసీ కోసం, సంబంధిత శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో మాట్లాడి సమస్య పరిష్కరిస్తామని హామి ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్టులు కొండ లక్ష్మన్, అనిల్‌కుమార్, కోల తిరుపతి, ఫోటో గ్రాఫర్ ఎండి షుకూర్, వీడియో జర్నలిస్టు దాడి సంపత్ తదితరులు పాల్గొన్నారు.

ఊపిరి పీల్చుకున్న రైతులు

-రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో పత్తి విత్తనాలకు ప్రాణం



కరీంనగర్ రూరల్ మండలంలో పత్తి మొక్కలు

కరీంనగర్ రూరల్, జూన్ 23: సకాలంలో వర్షాలు కురవకపోవడంతో అన్నదాతలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఇప్పటికే వేసిన పత్తి విత్తనాలు మొలకెత్తవేమోనని ఆందోళన చెందారు. శని, ఆదివారాల్లో కొద్దిపాటి వర్షం కురవడంతో రైతులు ఊపిరిపీల్చుకున్నారు. వర్షం స్వల్పంగానే కురిసినా ఎండిపోతున్న పత్తి విత్తనాలకు జీవం పోసినట్లు అయ్యింది. ఇన్నాళ్లు భూమిలోనే ఉన్న విత్తనాలు వర్షానికి మొక్కలుగా బయటకు కనిపిస్తుండడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

చేనేత సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళతాం

భగత్‌నగర్, జూన్ 23: రాష్ట్రంలో చేనేత కార్మికులు ఎదుర్కొంటున్న రాష్ట్ర చేనేత, జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు సహకారంతో ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళతామని అఖిలభారత పద్మశాలి సంఘం జాతీయ అధ్యక్షుడు కందగట్ల స్వామి, రాష్ట్ర అధ్యక్షుడు కామారపు మురళి అన్నారు. కొత్తపల్లి మండల కేంద్రంలోని ఇటీవల ఆత్మహత్య చేసుకున్న బొల్లబత్తిని వెంకటేశం, సిరిమల్ల గణేష్ కుటుంబాలను వారు పరామర్శించి, ఆర్థిక సహాయాన్ని అందించారు. కార్యక్రమంలో జాతీయ ప్రధాన కార్యదర్శి గడ్డం జగన్నాథం, రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు మెతుకు సత్యం, ప్రధానకార్యదర్శి మాచర్ల రామచంద్ర రావు, రాష్ట్ర రాజకీయ వ్యవహారాల కమిటీ ఛైర్మన్ వాసాల రమేశ్ పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

కరీంనగర్ టౌన్, జూన్ 23: నగరంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల కుమార్‌వాడీలో 1974-75లో ఎస్‌సీ చదివిన పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళన కార్యక్రమాన్ని నిర్వహించుకున్నారు. ఆదివారం నగరంలో జరిగిన ఈకార్యక్రమానికి ఆరోజు చదువు చెప్పిన సుగుణకుమారి టీచర్‌తోపాటు ప్రత్యేక ఆహ్వానితులను ఘనంగా సన్మానించారు. ఆనాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు.

వితంతువులు ధైర్యం కోల్పోవద్దు



మాట్లాడుతున్న మేనేజర్ ఎండీ ఖాజాబి

హుజూరాబాద్‌రూరల్, జూన్ 23: వితంతువులు ధైర్యం కోల్పోవద్దని బాల వికాస సంస్థ సెంటర్ మేనేజర్ ఎండి ఖాజాబి అన్నారు. మండలం లోని పోతిరెడ్డిపేట గ్రామంలో ఆదివారం బాల వికాస సంస్థ ఆధ్వర్యంలో ప్రపంచ వితంతు దినోత్సవ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. సమాజంలో మూఢ నమ్మకాలను పారద్రోలాలని చెప్పారు. వితంతులు ధైర్యాన్ని కోల్పోకూడదని చెప్పారు. ప్రతీ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపుని చ్చారు. కార్యక్రమంలో హుజూరాబాద్ ఏరియా మానవ హక్కుల సంఘం కమిటీ అధ్యక్షురాలు లతారెడ్డి, బాల వికాస సంస్థ మహిళలు తదితరులు పాల్గొన్నారు.

రేపు క్రీడాపాఠశాలకు ఎంపిక పోటీలు

గంగాధర, జూన్ 23: క్రీడాపాఠశాలకు మంగళవారం విద్యార్థులకు ఎంపిక పోటీలను నిర్వహిస్తున్నట్లు ఎంఈవో వేణుకుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 202 4-25 సంవత్సరానికి తెలంగాణ క్రీడాపాఠశాలలో నాలుగో తరగతిలో ప్రవేశానికి క్రీడాపోటీలను నిర్వహిస్తు న్నట్లు పేర్కొన్నారు. మూడో తరగతి చదివి 1 సెప్టెంబరు 2015 నుంచి 31 ఆగస్టు2016 మధ్య జన్మించిన విద్యార్థులు అర్హులని తెలిపారు. ఆధార్‌కార్డు, జనన ధ్రువీకరణ పత్రంతో మంగళవారం ప్రభుత్వ పాఠశాల మైదానంలో హాజరుకావాలని సూచించారు.

ముఖ్యమంత్రి చిత్రపటానికి క్షీరాభిషేకం



రేణికుంటలో ముఖ్యమంత్రి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న రైతులు

తిమ్మాపూర్, జూన్ 23: కరీంనగర్ కార్పొరేషన్ పరిధిలోని అలుగునూర్ కూడలి వద్ద, మండలంలోని రేణికుంట గ్రామంలో కాంగ్రెస్ శ్రేణులు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ చిత్రపటాలకు క్షీరాభిషేకం నిర్వహించి, స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతు కాంగ్రెస్ పార్టీ ఎన్నికల హామీలో భాగంగా రైతులకు రెండు లక్షల రుణమాఫీకి ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని చెప్పారు. దీంతో రైతుల పక్షాన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని తెలిపారు. కార్యక్రమాలలో కాంగ్రెస్ నాయకులు ఎలుక రాజు, తమ్మనవేణి రాములుయాదవ్, తాళ్ళపల్లి శ్రీనివాస్‌గౌడ్, ఎలుక శ్రీధర్, బోయిని దివాకర్, కర్ర అనిల్, తిరుపతి, సమ్మయ్య పాల్గొన్నారు.

రైతు రుణ మాఫీ ప్రకటనపై కాంగ్రెస్ సంబరాలు

కరీంనగర్ రూరల్,జూన్23: నగర కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆదివారం తీగలగుట్టపల్లిలోని బస్ స్టాప్‌వద్ద రైతురుణాల మాఫీ చేయడానికి మంత్రి మండలి నిర్ణయం తీసుకోవడం పట్ల సంబరాలు జరుపుకున్నారు. ఈసందర్భంగా రైతులకు స్వీట్లు పంపిణీ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు రుణమాఫీ చేయదని చేస్తే తను రాజీనామా చేస్తానని మాజి మంత్రి హరీష్ రావు అన్న మాటకు కట్టుబడి ఉండి తన రాజీనామ పత్రాన్ని సిద్ధం చేసుకోవాలని సుడా ఛైర్మన్, నగర కాంగ్రెస్ అధ్యక్షుడు కొమటిరెడ్డి నరేందర్ రెడ్డి అన్నారు. మాట్లాడుతూ ఎన్నికలలో ఇచ్చిన ప్రతి హామిని నెరవేర్చుతున్నందున సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వాన్ని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రజలు అభినంచడంతో పాటు రైతులు సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారన్నారు.ఎన్నికల హామిలలో ప్రజలకు ఇచ్చన హమీలను ఎంత భారమైన నెరవేర్చాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తుందన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఇరవై అయిదువేల రూపాయలు మాఫీ చేయడానికి అయిదు సంవత్సరాలు పట్టిందని కాంగ్రెస్ ప్రభుత్వం చేయదని చాలెంజ్ చేసిన మాజీ మంత్రి హరీష్ రావు రాజీనామా పత్రం సిద్ధం చేసుకోవాలని అన్నారు. ఏక కాలంలో రెండు లక్షల రూపాయలు మాఫీ చేడయం పట్ల రైతుల ముఖంలో ఆనందం వెల్లి విరుస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ ఛైర్మన్ ఆకారపు భాస్కర్ రెడ్డి, డివిజన్ అధ్యక్షుడు మెతుకు కాంతయ్య, మాజీ సర్పంచ్ జంగపల్లి మల్లయ్య పెంచాల లక్ష్మణ్ రావు, గుండాటి శ్రీనివాస్ రెడ్డి, హసీన, దండి రవీందర్, చింత పందు కనుకయ్య కొమ్మ సతీష్, హజార్, కారోబార్ మల్లయ్య చంద్రయ్య యాదవ్, కొనగాని అనిల్, షబానా, జ్యోతి రెడ్డి, ముల్కల కవిత, తిరుమల, పెద్దిగారి తిరుపతి, జిలుకర రమేష్, మాసుం ఖాన్, కీర్తికుమార్, పాండ్రాల లింగమూర్తి, బషీర్, ఖలీల్ పాల్గొన్నారు.



స్వీట్లు పంపిణీ చేస్తున్న సుడా ఛైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి

వేంకటేశ్వరస్వామి ఆలయంలో ధ్వజారోహణం

కరీంనగర్ కల్చరల్, జూన్ 23: నగరంలోని భగత్‌నగర్ జెడ్‌పి క్వార్టర్స్ ఆవరణలో గల ప్రాచీన వేంకటేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా పాంచరాత్ర ఆగమ శాస్త్రోక్తంగా ఆదివారం ఉదయం నిత్య ఆరాధన, అగ్నిప్రతిష్ఠ, ధ్వజారోహణం, హవనం జరిగాయి. కార్యక్రమంలో ఈఓ కొన్న కాంతారెడ్డి, భక్తులు పాల్గొన్నారు. కాగా సోమవారం ఉదయం 10-30 గంటల నుంచి వేంకటేశ్వరస్వామి కల్యాణం జరుగుతుందని పేర్కొన్నారు. కల్యాణం అనంతరం మేయర్ సునీల్‌రావు ఆధ్వర్యంలో అన్నదానం ఉంటుందని తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని శ్రీవారి కృపకు పాత్రులు కావాలని ఈఓ కాంతారెడ్డి కోరారు.

నోట్ బుక్స్ పంపిణీ

సుభాష్‌నగర్, జూన్ 23: మేము సైతం యువసేన ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్కూల్ పిల్లలకు నోట్ బుక్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ అధ్యక్షురాలు చకిలం స్వప్న, శ్రీనివాస్, రూప, కొమురవెల్లి ఆశోక్ పాల్గొన్నారు.

సుడాలో అక్రమ నియామకాలపై విచారణ జరిపించాలి

భగత్‌నగర్, జూన్ 23: శాతవాహన అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(సుడా)లో జరుగుతున్న అక్రమ నియామకాలపై ఉన్నత స్థాయి విచారణ జరిపించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి డిమాండ్ చేశారు. ఉద్యోగ పునరా వాస కేంద్రంగా నాటి ఛైర్మన్ సుడా కార్యాలయాన్ని మార్చేశారని ఆరోపించారు.

ఏడుగురు అనర్హులకు దొడ్డిదారిన ఔట్ సోర్సింగ్ ఉద్యోగాలు ఎలా ఇచ్చారని ప్రశ్నించారు. సుడా కార్యాలయంలో 2023 సెప్టెంబరులో అప్పటి సుడా ఛైర్మన్ వద్ద పనిచేసే కుటుంబీకులలో 5 మంది వ్యక్తులు ఔట్ సోర్సింగ్ ద్వారా నియామకాలలో నియమ నిబంధనలు పాటించకుండా అక్రమంగా నియమించారని ఆరోపించారు. సుడా ఏర్పడిన నాటి నుంచి ఇప్పటి వరకు సుడాకు ప్రభుత్వం నుంచి చిల్లగవ్వ కూడా రాలేదన్నారు. బిల్డింగ్ అనుమతులు, ఇతరత్రా అనుమతుల ద్వారా వచ్చే నిధులతోనే సుడా నడుస్తుందన్నారు. మొత్తం వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపించాలని జిల్లా కలెక్టర్‌ను కోరారు.

ముగిసిన మహా పడిపూజ

కరీంనగర్ కల్చరల్, జూన్ 23: అఖిల భారత అయ్యప్ప దీక్షా ప్రచార సమితి జాతీయ వ్యవస్థాపక అధ్యక్షుడు శ్రీరాజ్ దేశ్‌పాండే గురుస్వామి పర్యవేక్షణలో 'నీ గానమే నా ప్రాణం' పేరుతో నిర్వహిస్తున్న నిరంతర అఖండ భజన, అయ్యప్ప స్వామి మహా పడిపూజ ఆదివారంతో ఘనంగా ముగిసాయి. ఈ కార్యక్రమంలో ఉత్సవ చీఫ్ కోఆర్డినేటర్‌లు మెతుకు హేమలత పటేల్, నలుమాచు చంద్రశేఖర్, గురుస్వాములు పురాణం మహేశ్వరశర్మ, నరసింగారావు, గుండ రాధాకిషన్, రామకృష్ణ వాసు, రాజు, గడప నాగరాజు, విద్యార్థితో పాటు రాష్ట్ర వ్యాప్తంగా 30 భజన మండలుల బాధ్యులు, భక్తులు పాల్గొన్నారు.

నగర అభివృద్ధికి వేల కోట్లు తెచ్చాం

-ఎమ్మెల్యే గంగుల కమలాకర్

కరీంనగర్ టౌన్, జూన్ 23: పేద ప్రజల నివాస కాలనీలతోపాటు నగరాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో నగరపాలక సంస్థకు వేల కోట్లు తీసుకువచ్చి నగర రూపురేఖలను మార్చామని మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్, మేయర్ యాదగిరి సునీల్‌రావు అన్నారు. ఆదివారం నగరంలోని 24వ డివిజన్ కిసాన్‌నగర్‌లో కాళికాదేవి దేవాలయ స్వాగతతోరణంతో పాటు కోటి 20 లక్షలతో నిర్మాణంచేసిన ఏకలవ్య కమ్యూనిటీ హాల్‌ను వారు ప్రారంభించారు. శ్రీకాళికామాత దేవాలయంలో ప్రత్యేక పూజలు చేసి అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నగరాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేశామని చెప్పారు. నగరం అద్భుతంగా అభివృద్ధి చెందడంతో పాటు ప్రజల జీవన విధానం మారిందని అన్నారు. తమ పాలకవర్గానికి మంచి పేరు వస్తుందనే అసత్యపు ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. కార్యక్రమంలో కిసాన్‌నగర్ స్థానిక కార్పొరేటర్ కుర్ర తిరుపతి, ఎడ్ల సరిత అశోక్, కంసాల శ్రీనివాస్, ఐలేందర్‌యాదవ్, నాంపల్లి శ్రీనివాస్, మర్రిభావన సతీష్, బోనాల శ్రీకాంత్, తోట రాములు, తుల రాజేశ్వరి బాలయ్య, ఏకలవ్య సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే రైతు సంక్షేమం సాధ్యం

గణేశ్‌నగర్,జూన్ 23 : కాంగ్రెస్‌తోనే రైతు సంక్షేమం సాధ్యమని జిల్లా కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షుడు పురమల్ల రాజేశం అన్నారు. వరంగల్ రైతు డిక్లరేషన్ సభలో కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీ ఇచ్చిన హామీని నిలబెట్టుకోవడంపై ఆదివారం తెలంగాణ చౌక్‌లో ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్ చిత్రపటాలకు క్షీరాభి షేకం చేశారు. ఈ సందర్భంగా కోమటిరెడ్డి పద్మాకర్ రెడ్డి, పురం రాజేశంలు మాట్లా డుతూ కాంగ్రెస్ పార్టీ అంటేనే రైతు పక్షపాత ప్రభుత్వమని గతంలో వైయస్సార్ హయాంలో ముఖ్యమంత్రిగా పదవీ బాధ్యతలు స్వీకరించిన అనంతరం రెండు లక్షల రుణమాఫీ చేస్తూ నిర్ణయం తీసుకోవడం అభినందనీయమన్నారు. కాంగ్రెస్ పార్టీకి రైతుల పట్ల, ఇచ్చిన మాటకు కట్టుబడే విధానం పట్ల ఎంతటి చిత్తశుద్ధి ఉంటుందో ప్రతిపక్ష నేతలు గుర్తించాలని అన్నారు. కార్యక్రమంలో జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కర్ర సత్య ప్రసన్నారెడ్డి, జిల్లా కాంగ్రెస్ బీసీ సెల్ అధ్యక్షులు పులి ఆంజనేయులు గౌడ్, రాష్ట్ర కాంగ్రెస్ ఎస్సీ సెల్ కన్వీనర్ విన్నరాజ మల్లయ్య, చొప్పదండి పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు తిరుపతి గౌడ్ పాల్గొన్నారు.

'కరీంనగర్ కవులు నాడు-నేడు' పుస్తకావిష్కరణ



పుస్తకావిష్కరణ చేస్తున్న పెద్దపల్లి అడిషనల్ కలెక్టర్

కరీంనగర్ కల్చరల్, జూన్ 23: తెలంగాణ రచయితల సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ముఖరంపుర వాగీశ్వరి డిగ్రీ కళాశాలలో సంపాదకుడు, గ్రంథ ప్రచురణ కర్త, తెలుగు విశ్వవిద్యాలయం పూర్వ ఉప కులపతి ఆచార్య అనుమాండ్ల భూమయ్యచే వెలువరించిన 'కరీంనగర్ కవులు నాడు-నేడు' పుస్తకావిష్కరణకు పెద్దపల్లి జిల్లా అడిషనల్ కలెక్టర్ జీవి శ్యాంప్రసాద్‌లాల్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నాటి నుంచి నేటి వరకు కవిత్వం రాసిన కవుల కవితలను 'కరీంనగర్ కవులు నాడు-నేడు' పుస్తకం పేరుతో సంకలనంగా తీసుకువచ్చి ఇచ్చిన ఆచార్య అనుమాండ్ల భూమయ్య కృషి అభినందనీయమని అన్నారు. ఆచార్య అనుమాండ్ల భూమయ్య మాట్లాడుతూ తనకు జన్మ నిచ్చిన కరీంనగర్ కవుల కవితలను సంకలనంగా తీసుకు రావడం ఎంతో సంతృప్తినిచ్చిందని అన్నారు. సాహితీవేత్తలు డాక్టర్ మలయశ్రీ, డాక్టర్ గండ్ర లక్ష్మణరావు, డాక్టర్ నలిమెల భాస్కర్, వారాల ఆనంద్‌లకు ఆత్మీయ సత్కారాలు ఘనంగా జరిపారు. సంస్థ అధ్యక్షుడు కొత్త అనిల్‌కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు డి రాజారాంమోహన్, ప్రధాన కార్యదర్శి దొమ్మాటి శంకర్‌ప్రసాద్, నగునూరి శేఖర్ పాల్గొన్నారు.

శ్యాంప్రసాద్ ముఖర్జీకి ఘన నివాళి



శంకరపట్నంలో శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీకి నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

శంకరపట్నం: మండల కేంద్రంలో బీజేపీ మండలాధ్యక్షుడు ఏనుగుల అనిల్ ఆధ్వర్యంలో డాక్టర్ శ్యామ్‌ప్రసాద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో దండు కొంరయ్య, నరేందర్, శివారెడ్డి, శ్రీనివాస్, ప్రకాష్, రాజేందర్, సారయ్య, శివ, అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

ఇల్లందకుంట: మండల కేంద్రంలోని గరుడ చౌరస్తాలో బీజేపీ ఆధ్వర్యంలో శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ చిత్రపటం వద్ద నివాళులు అర్పించారు. కార్యక్రమంలో బీజేపీ మండలాధ్యక్షుడు సింగిరెడ్డి తిరుపతిరెడ్డి, నాయకులు కంకణాల సురేందర్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, షఫీ, సాయిరెడ్డి, సతీష్‌యాదవ్, మధుకర్, దుర్గయ్య, కోమల్‌రెడ్డి, జగన్‌రెడ్డి, రాజయ్య, దేవేందర్, విశ్వేష్‌కుమార్ పాల్గొన్నారు.

కరీంనగర్ టౌన్: భారతీయ జనసంఘ్ పార్టీ వ్యవస్థాపకుడు, ఆర్‌ఎస్ఎస్ సంఘ్ సభ్యుడు శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ బలిదాన్ దివస్ (వర్ధంతి)ని బీజేపీ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. శనివారం నగరంలోని విద్యానగర్ వినాయక చౌక్‌లో బీజేపీ నగర పశ్చిమజోన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈకార్యక్రమానికి జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై శ్యాంప్రసాద్‌ముఖర్జీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి మాడ వెంకట్‌రెడ్డి, వినుకొండ నాగేశ్వర్‌రెడ్డి, గుర్రల వెంకట్‌రెడ్డి, పల్లెపాటి సంపత్‌రావు, పుప్పాల రఘు, అసెంబ్లీ కన్వీనర్ దుబాల శ్రీనివాస్, ఎడమ సత్యనారాయణరెడ్డి, గుంజేటి శివకుమార్, రాగి సత్యనారాయణ, కచ్చు మధు, బండ రాకేశ్, శీతల రమేశ్‌చంద్ర, చందుగౌడ్, విద్యాసాగర్, మాతంగి హన్మయ్య పాల్గొన్నారు.

హుజూరాబాద్, జూన్ 23: హుజూరాబాద్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో భారతీయ జనసంఘ్ వ్యవస్థాపకుడు శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ వర్ధంతిని పురస్కరించుకుని బీజేపీ ఆధ్వర్యంలో ఆదివారం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో గంగిశెట్టి రాజు, పైళ్ల వెంకట్‌రెడ్డి, నల్ల సుమన్, రాజు, వొడ్నాల విజయ్, గంగిశెట్టి ప్రభాకర్, శ్రీనివాస్, వెంకన్న, సదయ్య, సమ్మయ్య, నాగరాజు, భార్గవ్, రవీందర్ తదితరులు పాల్గొన్నారు

జమ్మికుంట: :భారతీయ జనసంఘ వ్యవస్థాపకులు డాక్టర్ శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ వర్ధంతి వేడుకలు బీజేపీ అధ్వర్యంలో నిర్వహించారు.ఈ సందార్భంగా పట్టణ అధ్యక్షులు జీడి మల్లేష్ స్థానిక గాంధీ చౌరస్తాలో డాక్టర్ శ్యాం ప్రసాద్ చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమములో జీడి మల్లేష్,పల్లపు రవి రాగూర్,రాజేష్,గణేష్,మోతే స్వామి,రాపర్తి అఖీల్,దామెర ప్రవీణ్,గుర్రెపల్లి నిరుప రాణి,ఇంటికల స్వరూప,తదితరులు పాల్గోన్నారు.

చిగురుమామిడి: శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ అశయ సాధనకు ప్రతి బీజేపీ కార్యకర్త కృషి చేయలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కోమటిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి అన్నారు. మండలంలోని ఆయా గ్రామాల్లో బీజేపీ మండల శాఖ ఆధ్వర్యంలో శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ చిత్ర పటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు పైడిపల్లి శ్రీనివాస్, జిల్లా అదికార ప్రతినిధి పొన్నం శ్రీనివాస్, పత్తెం మొగిళి, రాగుల రవీందర్, చీమూర్తి తిరుపతి, ఎల్లయ్య, కంది శంకర్, అజయ్ తదితరులు పాల్గొన్నారు.



ఇల్లందకుంటలో శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీకి నివాళులర్పిస్తున్న నాయకులు

కళాకారుల మండల కార్యవర్గం

ఇల్లందకుంట, జూన్ 23: మండల కేంద్రంలోని శ్రీసీతా రామచంద్రస్వామి ఆలయ ఆవరణలో తెలంగాణ రంగస్థల సాంస్కృతిక కళాకారుల అసోసియేషన్ జిల్లా కమిటీ సమావేశం జిల్లా అధ్యక్షుడు వంగ సుధాకర్ ఆధ్వర్యంలో ఆదివారం మండల కళాకారుల కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కొడూరి రవీందర్, ఉపాధ్యక్షుడిగా అప్పాల రమేష్, ప్రధాన కార్యదర్శిగా బొమ్మెడు తిరుపతిగౌడ్, సహాయ కార్యదర్శిగా గురుకుంట్ల సాంబయ్య, కోశాధికారిగా సంపతి దేవేందర్‌రెడ్డి, జిల్లా డైరెక్టర్‌గా బండి మల్లయ్య ఎన్నికయ్యారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి అలివేలి సమ్మిరెడ్డి, జిల్లా కోశాధికారి నల్లగోని రమేష్, రామచంద్రారెడ్డి, పర్శరాములు, సంపత్, రాజ్‌కుమార్, తిరుపతి, యాదగిరి, రాజయ్య, శంకర్, సంపత్‌రావు తదితరులు పాల్గొన్నారు.

'ఆరుద్ర' కనువిందు



ఆరుద్ర పురుగు

చొప్పదండి, జూన్ 23: ఆరుద్ర కార్తి పేరు వినగానే మొదట గుర్తుకొచ్చేవి ఆరుద్ర పురుగులే. వాతావరణం చల్లబడి తొలకరి వాన కురువగానే నేలపై ఎర్రని బొట్టుగా మెరు స్తూ కనిపిస్తాయి. చొప్పదండి మండలం రుక్మాపూర్‌లో పంట చేలల్లో ఆదివారం ఆరుద్ర పురుగులు కనిపించాయి. కాగా వాతావరణంలో మార్పులు, ఇతరత్రా కారణాలతో కొన్నేళ్లుగా ఆరుద్ర కార్తిలో కూడా ఆరుద్ర పురుగులు అరుదుగా కనిపిస్తున్నాయి. ముట్టుకోగానే ముడుచుకునే మనస్తత్వంతో కూడిన ఆరుద్ర పురుగులను చూడాలని చాలా మంది అను కుంటారు.. శనివారం ఆరుద్ర కార్తి ప్రవేశించడంతో ఆరుద్ర పురుగు తలుక్కు మంటూ కళ్ల ముందు మెరియడంతో వాటిని చూసిన వారు ఆనందపడి పోయారు. చొప్పదండి మం డలం రుక్మాపూర్ గ్రామంలో పత్తి సాగు చేసేందుకు రైతులు దుక్కులు దున్నారు. రెండు రోజులుగా కురుస్తున్న చిరుజల్లులతో ఆరుద్ర పురుగులు మినుక్కుమంటూ మెరిశాయి. ఆరుద్ర పురుగు కనిపించగానే ఆరుద్ర కార్తిలోకి ప్రవేశించినట్లుగా రైతులు ఒకనాడు భావించే వారు. రసాయన ఎరువులు వాడకం పెరగడంతో అరుద్ర పురుగులు కను మరుగవుతున్నాయి.

పోగొట్టుకున్న పర్సు అప్పగింత

కరీంనగర్ క్రైం, జూన్ 23: చింతకుంటలో రోడ్డుపై లభించిన పర్సును పోగొట్టుకున్న బాధితుడికి అందజేసిన ఓ కార్మికుడు తన నిజాయితీని చాటుకున్నాడు. కొత్తపల్లి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మానకొండూర్ మండలం కొండపల్కల గ్రామానికి చెందిన షేక్‌హుస్సేన్ ఆదివారం ఉదయం కొత్తపల్లి మండలంలోని చింతకుంటలో ఉన్న తన కూతురు వద్దకు వెళ్లాడు. అతను వాహనంపై వెళుతున్న క్రమంలో నాలుగు వేల రూపాయలు నగ దుతో ఉన్న పర్సు, ఇతర ధ్రువీకరణలు, బ్యాంకు ఏటీఎం దారిలో పోగొట్టుకున్నాడు. చింతకుంటలోని ఒక రెడ్‌మిక్స్‌లో కార్మికుడిగా పనిచేస్తున్న ఎడపల్లి తిరుపతి కరీంనగర్‌కు వెళ్లి ద్విచక్ర వాహనంపై తిరిగి వస్తుండగా నగదుతో కూడిన పర్సు ఇతర ధ్రువీకరణలు లభించాయి. వీటిని తీసుకున్న తిరుపతి కొత్తపల్లి పోలీసు రాణాలో అప్పగించాడు. విధుల్లో ఉన్న హెడ్ కానిస్టేబుళ్లు కృష్ణారెడ్డి, మహేష్, అలీబేగ్‌లు పర్స్‌లో లభించిన ఆధారాలను పరిశీలించి బాధితుడికి సమాచారం అందించారు. బాధితుడికి పోలీసుల సమక్షంలో పోగొట్టుకున్న పర్సు అందజేశారు. కార్మికుడు తిరుపతిని కొత్తపల్లి ఎస్ఐ ఎస్ సాంబమూర్తి అభినందించారు.

సీఎం, మంత్రి చిత్రపటాలకు క్షీరాభిషేకం

భగత్‌నగర్, జూన్23: రైతులకు ఏకకాలంలో రెండు లక్షల రూపాయల రుణమాఫీ చేసిన సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్‌ల చిత్రపటాలకు కొత్తపల్లి పట్టణ కాంగ్రెస్ ఆధ్వర్యంలో క్షీరాభిషేకం చేశారు. అనంతరం స్వీట్లు పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ నాయకులు గడ్డ శ్రీనివాస్, పట్టణ అధ్యక్షుడు చిలుక హనుమంతరెడ్డి, దుబ్బాసి కుమార్, పొన్నం శ్రీనివాస్, ఎర్రం కనకారెడ్డి, జెరిపోతుల వాసు, చింతల శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.

సేంద్రియ వ్యవసాయంపై అవగాహన పెంచుకోవాలి

కరీంనగర్ టౌన్, జూన్ 23: సేంద్రియ వ్యవసాయంపై అందరూ అవగాహన పెంచుకోవాలని రిటైర్డు జాయింట్ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చరల్ సముద్రాల జనార్దన్‌రావు అన్నారు. ఆదివారం స్థానిక కృషిభవన్‌లో ప్రతిమ ఫౌండేషన్ స్టడి సర్కిల్లో వివిధ పోటీపరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులకు జీఎస్ ఆనంద్ నిర్వహించిన అవగాహన సదస్సుకు ఆయన ముఖ్య వక్తగా హాజరై ప్రసంగించారు. ఈకార్యక్రమంలో గట్ల శ్రీనివాస్, ఇరుమల్ల అశోక్, ఆరెల్లి సాయికృష్ణ పాల్గొన్నారు.

వివేకానందలో 'తల్లిదండ్రుల ఆశీర్వచన్'

కరీంనగర్ టౌన్, జూన్ 23: నగరంలోని వివేకానంద విద్యానికేతన్ విద్యాసంస్థల్లో ఏర్పాటు చేసిన విద్యార్థులకు తల్లిదండ్రుల ఆశీర్వచన్ కార్యక్రమం ఆహుతులను ఎంతగానో ఆకట్టుకుంది. ఆదివారం భగత్‌నగర్‌లోని వివేకానంద విద్యానికేతన్ విద్యాసంస్థల్లో పదవ తరగతి చదువుతున్న విద్యార్థులు మంచి ఫలితాలు సాధించేందుకు, చిన్నారుల్లో మార్పు, ఆత్మీయత అనుబంధాలను పెంపొందించే ఉద్దేశంతో విద్యార్థులచే తల్లిదండ్రులకు పాదపూజ కార్యక్రమం, తల్లిదండ్రులు చిన్నారులకు ఆశీస్సులు అందించారు. ఈకార్యక్రమానికి విశిష్ట అతిథులుగా గర్రెపల్లి మహేశ్వరశర్మ, రామాచార్యులు హాజరై మాట్లాడుతూ విద్యార్థులు తల్లిదండ్రుల ఆశీర్వాదం తీసుకోవడం గొప్ప మానసిక బలాన్ని ఇస్తుందన్నారు. కార్యక్రమంలో వివేకానంద విద్యాసంస్థల చైర్మన్ కొమురయ్య ప్రిన్సిపాల్ మిథున్ జె మిస్త్రీ పాల్గొన్నారు.

ముగిసిన బ్రహ్మోత్సవాలు

కరీంనగర్ కల్చరల్, జూన్ 23: నగరంలోని మంకమ్మతోట వేంకటేశ్వరస్వామి ఆలయ 14వ బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం ఉదయం సుదర్శన, నారసింహ హోమం, పూర్ణాహుతి, సాయంత్రం ద్వాదశారాధన, సప్తావరణాలు, ఏకాంతసేవతో ఉత్సవాలు ఘనంగా ముగిసాయి. ఈ కార్యక్రమంలో వ్యవస్థాపక వంశీయ ధర్మకర్త పిట్టల శ్రీనివాస్, ఈఓ నాగారపు శ్రీనివాస్ పాల్గొన్నారు.

వేముగంటి రామారావుకు ఘన నివాళి

కరీంనగర్ స్పోర్ట్స్, జూన్ 23: ఉమ్మడి జిల్లాలో క్రీడా, సాహిత్య, యువజన రంగాలలో యువకులను చైతన్య పరిచిన మార్గదర్శ కుడు దివంగత మాజీ యూత్ కోఆర్డినేటర్ వేముగంటి రామారావు అని అంతర్జాతీయ యోగా క్రీడాకారుడు నాగిరెడ్డి సిద్దారెడ్డి అన్నారు. ఆదివారం నగరంలో రామారావు చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో వేముగంటి జితేందర్‌రావు, తెలంగాణ రాష్ట పాలిటెక్నిక్ సంఘం అధ్యక్షుడు మధుసూదనరెడ్డి పాల్గొన్నారు.

ప్రైవేట్ బస్సును ఢీకొట్టిన లారీ



వివరాలు తెలుసుకుంటున్న పోలీసులు

చిగురుమామిడి,జూన్ 23: మండలంలోని సుందరగిరి శివారులో కరీంనగర్ నుంచి యాదగిరి గుట్టకు వెళుతున్న టిఎస్ 02యుసీ5547 నంబరుగల ట్రావెల్స్ బస్సును హుస్నాబాద్ నుంచి కరీంనగర్ కు వెళుతున్న ఏపీ39 టీపీ 7376 నంబరుగల లారీ ఆదివారం ఉదయం ఢీకొట్టింది. డ్రైవర్ అప్రమత్తంగా ఉండడంతో బస్ స్వల్పంగా దెబ్బతిన్నది. బస్సులో ఉన్న ప్రయాణికులకు ఎలాంటి ప్రమాదం జరుగలేదు. బస్ డ్రైవర్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై బండి రాజేశ్ తెలిపారు.

రాజాపల్లిలో వైద్య శిబిరం

హుజూరాబాద్‌రూరల్, జూన్ 23 : మండలంలోని రాజాపల్లి గ్రామంలో నెహ్రూ యువ కేంద్రం, యువశక్తి యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం వైద్య శిబిరం నిర్వహిచారు. ఈ సందర్భంగా వైద్యులు డాక్టర్ భగీరథ, వైద్య సిబ్బంది గ్రామస్థులకు బీపీ, షుగర్, ఈసీజీ పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో యువశక్తి యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు మునిగాల అశోక్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పోచమ్మ బోనాలు

చొప్పదండి, జూన్ 23: చొప్పదండి పట్టణంలోని మాల సామాజిక వర్గం ఆధ్వర్యంలలో పోచమ్మ బోనాలు వైభవంగా నిర్వహించారు. మహిళలు సాంప్రదాయబద్ధంగా ఒకే రకమైన చీరలు ధరించి బోనాలను ఎత్తుకొని పురవీధుల గుండా ఊరేగింపుగా వెళ్లి పోచమ్మ తల్లికి మొక్కులు చెల్లించుకున్నారు.

ఈదురుగాలులకు కూలిన చెట్టు

హుజూరాబాద్‌రూరల్, జూన్ 23: మండలంలోని చెల్పూర్ గ్రామంలోకి వెళ్లే ప్రధాన రహదారిపై సాయంత్రం భారీ ఈదురుగాలులతో భారీ వృక్షం నేలకొరిగింది. ఈ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో ప్రాణనష్టం తప్పింది. ఈ ఘటనలో సమీపంలోని రేకుల పందిరి కూలిపోయింది. కాగా సమీపంలోనే విద్యుత్తు తీగలు ఉండడంతో దానిపై చెట్టు పడి ఉంటే గ్రామం అంధకారంగా మారి ఉండేది.